# ధర్మక్షేత్రం

అతను - సుందరం. ఆ శ్లోకం పదే పదే చదువుతున్నాడు.

"ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః
మామకాః పాండవాశ్చైవ కిమకుర్వత సంజయ !"

అతనిలోని కురుక్షేత్రం ఆ శ్లోకానికి ఎన్నో అర్థాలు చెప్తోంది. అవతలి గదిలో రాధ నిద్రపోతోంది. తనలాగే ఆమె కూడా ఎన్నో తుఫానులనించి ఈ గూటిలోకి వచ్చి నిద్రపోతోంది. తనకి నిద్ర రాదు. లోలోపల కురుక్షేత్ర యుద్ధంలాగే తనలో సంగ్రామం జరుగుతోంది.

రాధ గడిపిన జీవితం తనకి తెలుసును. తాను అసహ్యించుకుంటానని అతని భయం. ఆమెకి తెలీదు-ఆమెని క్షమించగలిగే శక్తి తనకి ఉన్నా, ఆమెని క్షమించే హక్కు లేదని.

ఎలాగో ఆమెకి చెప్పాలి.

ఆమె అర్థం చేసుకునేలాగ చెప్పాలి.

ఆమె చేతా అన్నీ చెప్పించాలి. ఆమె మనస్సుని తేలిక చెయ్యాలి. ఆమెలో మలినం లేదని ఆమెకి అనిపించాలి.

దానికి సూత్రం ఈ పుస్తకంలోనే ఉంది.

తన మనసులాగే ఈ చిన్న ఇల్లూ కురుక్షేత్రమై, ఒక కొత్త గుర్తింపు రావాలి. తనలోనూ ఆమెలోనూ...అన్నీ వదులుకుని దేశాలు తిరిగి బైరాగిలాగ బ్రతికి తానూ, అన్నీ అనుభవించి, పట్టణాలలో మునిగి, రుచులు చూసి చూసి ఆమె-ఇద్దరూ వర్షానికి తడిసిన పక్షుల్లాగ ఈ గూటిలో చేరేరు. ఇద్దరూ అనుకోకుండానే వచ్చారు. ఇద్దరూ అలిసిపోయారు. ఇద్దరూ ఏకాకులు.

అతని మనస్సు ఈ ఆలోచనలతో ఊగులాడుతోంది. బయట వర్షం పడుతోంది.

ఎలెక్ట్రిక్ దీపపు కాంతిలో ఆ గది గోడలు దుర్మార్గుడి మనసులాగ వికారంగా ఉన్నాయి. వీటిని శుభ్రం చెయ్యాలి.

అవతలి గదిలో పసిపిల్లలాగ నిద్రిస్తోన్న రాధ ఆలోచనలూ, జ్ఞాపకాలూ యిలాగే వికారంగా ఉంటాయి. వాటినీ శుభ్రం చెయ్యాలి.

పుస్తకం మూసి కిందని పెట్టి చాపమీద పడుకున్నాడు సుందరం.

ఇన్ని సంవత్సరాల చరిత్ర అతన్ని నిద్రనించి దూరంగా ఉంచలేదు.

ఆ వెలుతురులో అలాగే అతను బయటికి చూస్తూ కూర్చున్నాడు.

ఆ రాత్రి ఆ ఇంట్లో ఆ ఇద్దరూ.

ఇద్దరూ రెండు చరిత్రలు.

రెండు హృదయాలు.

కాని, వేరు వేరు గదుల్లో. అయినా, ఆ సాయంత్రం, ఆ రాత్రి, ఆ ఇద్దరూ ఒక్కరే.

వారి చరిత్రలూ ఒక రకమే.

బయట వర్షం ఎక్కువ అవుతోంది.

ఎప్పటి రోజులో అతనికి జ్ఞాపకం వొస్తున్నాయి.

ఆమె కూడా కలలో వాటిని గురించే ఆలోచిస్తూ ఉండాలి!

## 1

"లక్ష్మి పెళ్ళికాకుండా, నా పెళ్ళికి తొందర ఏమిటమ్మా?" అని అడిగేడు సుందరం, తల్లికి సమాధానంగా.

"అలాగే నేనూ అనుకున్నాను సుందరం!...కాని, దానికి ఇప్పట్లో కుదిరేలాగ లేదు. అయినా దానికి పద్ధెనిమిది వొచ్చింది. నీకు పాతిక వెడుతోంది. నువ్వు ఉద్యోగం చేసు

కుంటున్నావు. దానికి పెళ్ళేకాకపోతుందా?" అంది కాంతమ్మ తార్కికంగా.

"ఏం ఉద్యోగమోనమ్మా! ఇంటిమీద తాకట్టు అలాగే ఉంది! అక్కడ ఒక్క గదిలో నలుగురుం సర్దుకుని ఆఫీసుకి వడిచి వెళ్ళొస్తే - నెలకి నూటపాతిక నీకు పంపడం గగనం అవుతోంది! ఈ పరిస్థితుల్లో నేను పెళ్ళి చేసుకుని ఎలాగ ఖర్చులు భరించేదమ్మా?" అన్నాడు బాధకన్నా, నిజాన్ని చూపెడుతూ సుందరం. అతనికి తల్లికన్నా తర్కం ఒక పాలు ఎక్కువే వొచ్చును. జీవితం అతని తర్కానికి రాసి రాసి పదును పెటింది.

"అలా ఉండిపోతావుట్రా? బి.య్యే. పాసయావు... వొచ్చేదాని అదృష్టం బాగుంటే నీకు మంచి ఉద్యోగం దొరక్కపోతుందా? అయినా ఆడపిల్ల వొట్టి చేతుల్తో వొస్తుందా ఏం? అంది కాంతమ్మ.

"ఏమిటోనమ్మా! ఈ కట్నాలని గురించి మరీ చర్చలు సాగుతున్నాయి. చాలామంది ఆడపిల్లలు కట్నాలు ఇచ్చి చేసుకోం అంటున్నారు..."

కాంతమ్మ నవ్వుతూ. "పత్రికల్లోనూ సినీమాల్లోనూ అలాగ కాకపోతే మరెలాగ అంటార్రా? అవధానిగారు నాలుగు సంబంధాలు చెప్పొచ్చారు. నలుగురూ కాస్తో కూస్తో ఇస్తామనే వొచ్చారు. అయినా, వాళ్ళ పిల్లకే, వాళ్ళ అల్లుడికే కాదా ఏమిటి వాళ్ళిచ్చుకునేది? రేపు మన లక్ష్మికి పెళ్ళిచేసి వొట్టి చేతుల్తో పంపుతాముట్రా? ఇవాళ మీ అన్న మనవేపు

చూడడంలేదంటే, వాళ్ళు ఆవిడ తెచ్చినదే కాకపోతే ఏమిటి?" అంది.

"విశ్వం మాట ఎత్తొద్దమ్మా!" అన్నాడు ఒక్కసారి తల్లిమీది జాలీ, అభిమానమూ ఎక్కువ చేసుకుని.

"అలా గేలేరా! భూములన్నీ వాడి చదువుకీ, ఇల్లు నీ చదువుకీ అయింది! కాకపోతే భూములు అమ్మేశాం! ఇల్లు తాకట్టుపెట్టేము. వాణ్ణీ నిన్నూ తెలుచుకోకుండా జరిగేదెలా గరా?" అంది బాధపడుతూ కాంతమ్మ. ఆవిడ ఇంటి చుట్టూ చూసింది. పాతకాలందే అయినా చాలా దిట్టంగా కట్టిన పెంకుటిల్లు అవి, కాని దాని విలువ కోసేవాళ్ళకి చాలా తక్కువ. ఎంత తక్కువ అంటే. మరో వెయ్యి రూపాయలు వడ్డీ పెరిగాక ఆ ఇంటికీ ఆ బాకీకీ చెల్లు. మరో నాలుగైదు నెలల్లో వడ్డీ పెరుగుతుంది. అందులో సందేహం ఏమీ లేదు. అలా జరగదని ఆశలేదు. అప్పిచ్చిన స్వామిగారు ఈ మధ్య అన్నాడు! "కాంతమ్మగారూ! అప్పు రాత్రీ పగలూ పెరుగుతోంది!... అబ్బాయిలు ఉద్యోగాలు చేస్తున్నారు. మీరూ అమ్మాయీ పట్నం వెళ్ళిపోయి చేతులు కడుక్కోండి! మీరు పరాయివాళ్ళు కాదు! నాలుగోందలో ఐదోందలో చివరిసారిగా సర్దుతాములెండి!" అని, ఉపకారంచేస్తోన్నట్టూ. ఒక అప్పుడి సలహాలాగా అవివున్నా, వాటి అంతర్యం కాంతమ్మకి బాగా తెలుసును. వ్యవహారజ్ఞానం లేని మనిషి కాదామె. మొగుడు బ్రతికి ఉండి, కొంచెం పచ్చగా ఉన్న రోజుల్లో ఆమె కొంతకాలం వడ్డీవ్యాపారం చేసింది. దాన్లో కొంత మిగిలింది. కాని ఆయనకి జబ్బుచేశాక

ఆ డబ్బు అంతా డాక్టర్లకీ, మందులకీ, పళ్ళకీ, రిక్షాలకీ, ఇంకా ఇంకా అనుకోని రకరకాల ఖర్చులకి ఇతర అప్పులతోబాటే ఖర్చయిపోయింది. ఆ రోజుల్లో నేర్చుకున్నదంతా ఆమె తన రక్షణకోసం కూడా వినియోగించుకోలేకపోయింది. వడ్డీ పెరుగుతూనే ఉంది. ఒక ఆవుమీద వొస్తూన్న కొద్దిపాటి లాభమూ, చిన్న పెన్షనూ తప్ప ఆమెకి ఏమీలేదు. ఇల్లు అద్దెకిద్దామని చూసింది. సంసారులకి చాలదు; ఒంటరిగాళ్ళకి ఇస్తే ఇంట్లో వయసొచ్చిన పిల్లని పాడుచేస్తారు అనే భయం. అయినా, ఆ పల్లెటూరిలో న్యాయమైన అద్దె దొరకడం కూడా కష్టమే.

సుందరానికివన్నీ తెలుసును. ఎలాగైనా మరి కొంచెం ఆర్జిద్దామని అతనికి ఉంది. చిన్న దుకాణాల్లో పద్దులు రాసి అప్పుడూ అప్పుడూ అతనూ కొంచెం కొంచెం ఆర్జించగలిగినా, అది దేనికీ సరిపోలేదు. అదీకాక అలాంటి చిల్లర పనులు ఉండీ ఉండీ దొరుకుతాయి; అట్టేకాలం సాగవు. అతనికి ఆ పనిలో ప్రత్యేకమైన నైపుణ్యం ఏమీలేదు. అంచేత ఆ అర్జన మరీ తక్కువ. అమ్మకి చెప్పి ఆమెలో ఆశలు రేకెత్తించే అంత లేదు.

"సరేలే...కాని, చెప్పేనుగా! ఇంకో సంవత్సరంలో ప్రమోషను వొస్తే యు.డి. అయితే ఆలోచిద్దాం అమ్మా! కనీసం ఎక్కడేనా ఒక్క గది ఇళ్ళయినా తీసుకోవొచ్చును. ఇప్పుడు పెళ్ళిమాట వొద్దులే" అన్నాడు తన పరిస్థితి అంతా చూసుకుని, సుందరం.

"నీ పరిస్థితి నాకు తెలియనురా! కాని, ఓ సంబంధం వొచ్చింది...వాళ్ళు నాలుగు వేలిచ్చి పెళ్ళిచెయ్యడానికి సిద్ధంగా ఉన్నారు. అదికాక - ఆ పిల్ల ఒక్కతే సంతానం. పిల్లకి తల్లిలేదు. తండ్రికి అంతో ఇంతో ఉందిట! అతనికి ఏదో జబ్బుట. తదనంతరం అంతా దీనికే వొస్తుంది..."

"అలా అని అతని చావుకోసం ఎదురుచూస్తూ ఏం కూర్చుటాం? అది ఏం బావుటుంది?" అన్నాడు సుందరం. అతనిలో ప్రత్యేకమైన దయాదాక్షిణ్యాలు మిగిలిపోయి కాదు- అదేటో వొచ్చేదాకా భార్యనెలాగ పోషించడం అని.

"విను మరీ! వాళ్ళకి పట్నంలో చిన్న ఇల్లు ఉందిట. ఎలాగా కూతురికి వచ్చేదే కదా! ఎవరికో అద్దెకిచ్చేరుట. ఖాళీ చేయిస్తే దాన్లో నువ్వుండొచ్చు. ఇక్కడ ఇల్లు అమ్మితే రెండు వేలు మూడు వేలేనా మిగలకపోవు. ఆ మొత్తం వడ్డీకి తిప్పితే అందరం అక్కడే ఉండొచ్చు." అంది కాంతమ్మ.

"వాళ్ళ కెంత ఉందో తెలీదు. అతనెప్పుడు చస్తాడో ఏమో! పట్నంలో వడ్డీల వ్యాపారం నీకూ కొత్త. నాకూ ఏం తెలీదు. రాబడి ఏమైనా వొస్తుందో లేదో తెలీదుగాని ముందర పిల్ల మాత్రం వొస్తుంది. లక్ష్మికి చెయ్యకుండా నేను చేసు కున్నానన్న అపవాదూ వొస్తుంది..." అన్నాడు సుందరం.

"అవన్నీ నాకొదిలేరా! ఆ పిల్లని చూడ్డానికి రెండు కళ్ళు చాలవుట. వెన్నెలని మలిచిన బొమ్మలాగ ఉంటుందిట. అదృష్టవంతురాలైతే మన రోజులు మారకపోతాయిట్రా!

మధ్యాహ్నం అవధానిగార్ని రమ్మన్నాను...ఒకసారి వెళ్ళి చూడు" అంది.

ఆవిడే ఏదైనా తలుచుకుంటే సాధించి తీరుతుందని తెలిసే, పిల్లని గురించి వినగానే వర్ణనకి ఎంత డిస్కౌంట్ ఇచ్చినా ఇంకా కొంత అయినా అందం ఉండకపోతుందా అని అనిపించీ, సుందరం చివరికి సరేనన్నాడు. ఆ తరవాత మాటల్లో బయటపెట్టింది కాంతమ్మ...బహుశా మరెవ్వరైనా ఆ మాట చెప్పి కొడుకు మనసు విరిచీకుండాను. ఆ విషయం చాలా చక్కగాం చెప్పింది కూడాను. "ఆ పిల్లతల్లి వేరే కులంట... పేరుకి పెళ్ళికాని మనిషి అని కూడా అంటారుట. అయినా, ఈ రోజుల్లో కులం, శాఖ అనడం తెలివితక్కువగా ఉంటుంది. అవన్నీ మన లక్ష్మికి చూసుకుందాంలే. నువ్వెప్పుడూ ఆధునికంగానే ఆలోచించావు గదా!" అంది. సుందరం నవ్వి ఊరుకున్నాడు.

వెళ్ళి అమ్మాయిని చూసి వొచ్చాడు. ఉదయం వెళ్ళి సాయంత్రం వొచ్చాడు.

"ఎలా ఉందిరా? నచ్చిందా?" అని అడిగింది తల్లి.

"వెంటనే ముహూర్తం పెట్టించు" అన్నాడు.

"పిల్ల పేరేంటి?" అంది తల్లి.

అతనికి తెలీదు. నిజానికి అమ్మాయి పేరు రాధ. రాధని చూశాక అతని మతిపోయింది. ఒకటే ఆలోచన. అదంతా ఆమెని గురించే.

"మర్యాదగా చూశారా?" అంది అతని జవాబు రాక పోయేసరికి.

"ఓ. చాలోను. ముహూర్తం పెట్టించు."

ముహూర్తం పెట్టేరు. చాలా త్వరగానే. ఆ లోగానే ఏదో జరగరానిదే జరిగి రాధ తనది కాకుండా పోతుందని సుందరానికి అహోరాత్రాలూ భయంగా ఉండేది. చాలా నిరాడంబరమైన పెళ్ళి జరిగింది, అదీ సుందరానికి చాలా నచ్చింది. మరీ ఎక్కువమంది రాధని చూడడం అతనికి ఇష్టంలేదు.

## 2

ముహూర్తం మరునాడు రాధ కాపురానికి వొచ్చింది. పేరుకైనా ఆమె సుందరంతోబాటు అక్కడ ఉండాలని తండ్రీ అనలేదు. వెంటనే ఆయన ట్రీట్‌మెంటుకి కేరళ వెళ్ళాలని మాత్రం ఒకసారి అన్నాడు. ఆయన ఏం ఉద్యోగం చేసేవాడో ఆ ఊరిలో ఏంచేస్తున్నాడో ఆ వివరాలేవీ సుందరానికి తెలీదు. అతనడగనూ లేదు. తెల్లవారుఝామున ముహూర్తం. మధ్యాహ్నం భోజనం. నాలుగ్గంటలకి ఒక రైలు ఉంది. దానిలో ఎక్కి బాగా చీకటిపడ్డాక తానూ తల్లీ లక్ష్మి రాధా ఇంటికి వచ్చారు. టికెట్లు మామగారే కొని ఇచ్చారు.

ఇల్లు కాస్త శుభ్రంచేసి భోజనాలయాయని అనిపించే

సరికి రాత్రి పది అయింది. ఒక మూలన లక్ష్మి చదువుకొం టూంది. మర్నాడు పరీక్ష ఏదో ఉంది స్కూల్లో అని. రాధ ఆ పక్కనే నేలమీద నిద్రపోయింది. వంట ముగించి కాంతమ్మ, "రైల్లో నిద్రపోయింది-మళ్ళీ బాగా నిద్రపట్టేసిందిలా ఉంది" అంది, జనాంతికంగా. "తెల్లారుఝామున ముహూర్తంకదా! ఏ అర్ధరాత్రి లేచిందో!" అన్నాడు సుందరం. కాంతమ్మ రాధని లేపి భోజనానికి రమ్మంది.

"నా కాకలిగా లేదు. మీరు చేసెయ్యండి" అంది రాధ, లేచి కూర్చుని కళ్ళు నులుముకుంటూ.

"ఇంటికి రాగానే తలస్నానం గూడా చేశావు! ఏమీ తిన కుండా నిద్రపోకూడదు. కొంచెం తిను..." అంది కాంతమ్మ.

"అవును. అలాగ చెయ్యి" అన్నాడు సుందరం.

అలాగే చేసింది రాధ. పేరుకి కొంచెం తిని లేచింది. కంచం కూడా తియ్యలేదు. ఆ పనులన్నీ లక్ష్మి చేసింది.

సుందరం ఆకలిమీద ఉన్నాడు. మరి కొంచెం ఎక్కువే తిని లేచి గదిలోకి వెళ్ళేసరికి రాధ మంచి నిద్రలో ఉంది. ఆమెని లేపే ప్రయత్నంచేసి, నిశ్శబ్దంగా ఆ ప్రయత్నం కొనసాగించ లేక, మాట్లాడకుండా నిద్రపోయాడు. నిద్రలోకి జారేముందు రాధ రైల్లో అతనితో ఒక్క మాట కూడా అడలేదనీ, ఇంటి కొచ్చాక, "స్నానం చేస్తారా?" అని అడగడానికి తప్ప (అతను అక్కరలేదన్నాడు) మళ్ళీ మాటలాడలేదనీ అతనికి జ్ఞాపకం వొచ్చింది.

"మాటలకి ఇంకా చాలా టైము ఉందిలే!" అని తనకి తానే చెప్పుకుని నిద్రలోకి జారేడు. అతను ఉదయం లేచేసరికి ఎనిమిదవుతోంది. కాఫీ తాగి, "రాధ ఏది?" అన్నాడు అటూ ఇటూ చూసి.

"వాళ్ళ నాన్నకి ఉత్తరం రాయాలిట. పోస్టాఫీసుకి వెళ్తానని వెళ్ళింది." అంది కాంతమ్మ. చాలా విపరీతమైనది జరిగినట్టూ అది చెప్పడం తనకి ఇష్టంలేనట్టూ ఉంది ఆమె గొంతుక.

సుందరం కూడా కొంత ఆశ్చర్యపోయాడు.

"లక్ష్మిని తీసికెళ్ళమనలేకపోయావా?" అన్నాడు.

"ఉత్తరం పోస్టు చెయ్యడానికి దాని సాయం ఎందుకురా? ఏమిటి రాసిందో ఏమో-ఆరుకల్లా లేచివొచ్చి స్నానం చేసి కాఫీ తాగి ఇప్పటిప్పటిదాకా ఉత్తరం రాస్తూనే ఉంది!" అంది అతనివంక అనుమానంగా చూస్తూ.

సుందరం కాఫీమీద దృష్టి కేంద్రీకరించి, మౌనంగా కూర్చున్నాడు. నిన్నటికీ ఇవేళకీ రాయడానికి ఆమెకి అన్ని వార్తలేం ఉంటాయి? లేక, రాత్రి నేను బాగానిద్రపోయాను. ఆయనా నిద్రపోయారు. కాని, చాలా పెద్ద గురకలు పెట్టడాన్న నాకు తెలివివొచ్చి మళ్ళీ నిద్ర పట్టలేదు అని రాసి ఉంటుందా! కర్మ! తన రూమ్మేట్సు కూడా తనని తరుచు ఈ గురక విషయంలో విమర్శిస్తూ ఉండేవారు. (వాళ్ళనెవళ్ళనీ పెళ్ళికి పిలవకపోడానికి అదొక కారణం!)

ఆ ఇంటికి పోస్టు బాక్సు రెండుఫర్లాంగుల దూరం ఉంది.

అక్కడే పోస్టాఫీసూను. వెళ్ళి వొచ్చేసరికి మరో పది నిమిషాలు పడుతుంది-అనుకునీ, "పిచ్చిపిల్ల! నాతో చెప్తే నేను వెళ్ళి వొచ్చేవాణ్నిగా!" అన్నాడు పైకి.

కూర తరగడానికి సరంజామా అంతా సిద్ధంచేసుకుని, "ఏమో! ఎందుకని తనే స్వయంగా వెళ్ళిందో! లేకపోతే లక్ష్మికిస్తే అది మాత్రం ఆపాటి చెయ్యదా ఏం? ఆడబోడుచు లాంఛనాలు ఇవ్వలేదని మానేస్తుందా?" అంది కాంతమ్మ.

"నాకేం అక్కర్లేదులే!" అంది అప్పుడే బట్టలు కట్టుకుని వొచ్చిన లక్ష్మి.

"నీకు నేనిస్తాగా! నయమే! ఆ కట్నం డబ్బులైనా అడగ్గానే ఇచ్చేశాడు. పెళ్ళికంతా కలిపి రెండొందలు కూడా ఖర్చైనట్టులేదు, ఒక్కగా నొక్క కూతురు. అయినా..."

సుందరం లేచి వీధి గుమ్మంలో నిలబడ్డాడు. రాధని గురించి గాని, ఆమె తండ్రిని గురించిగాని విమర్శన ఏదీ వినాలని లేదతనికి. రాధ త్వరగా వొచ్చేస్తే బాగుండును - ఆమె కోసం కొంచెం దూరం వెడదామని ఉంది అతనికి. కానీ అమ్మ వెక్కిరిస్తుందని అతని భయం. ఆ ఆలోచనల మధ్య అతనికి రాధ మీద కొంచెం కోపం కూడా వొచ్చింది. ఆమె ఆ చిన్న ఊరిలో అలాగ ఒంటరిగా బయటికి వెళ్ళడం అతనికి ఇష్టంలేదు. అదీ, పెళ్ళి అయిన మర్నాడే. ఊళ్ళో వాళ్ళందరూ ఆమెని చూసి గుసగుసలాడుతారు. అది తనకి బాధ కలిగిస్తుంది...

అయినా, మొన్నటిదాకా రాధని చూడకుండానే పొగుడుతూన్న అమ్మ, రాధ ఇంటికి రాగానే ఇలాగ అయి

పోయిందేమిటి? అనుకున్న కన్నా అన్నీ బాగానే జరిగాయి. అనుకున్నకన్న ఎక్కువ నగలతోనే వొచ్చింది రాధ. పెళ్ళి చూపులనాటి కన్నా కూడా చక్కగా ఉంది ఇప్పుడు. అమ్మకి అసంతృప్తి ఎక్కడో అతనికి బోధపడలేదు. చివరికి అమె ఎలాగో సర్దుకుంటుందిలే అనుకున్నాడు.

తొమ్మిదవుతోంటే వొచ్చింది రాధ.

అప్పటికీ భయం, ఆత్రుత, అనురాగం, అనుమానం, అసహనం - ఇవన్నీ అయి కోపంలో ఉన్నాడు సుందరం. నిన్న రాత్రి జరిగినదాని తరవాత ఆమె ఈ ప్రవర్తన ఎలాగో చాలా అభ్యంతరం చెప్పాల్సిందిగా కనిపించింది.

తన పక్కనించే లోపలికి పోబోంతోంటే చెయ్యి పట్టుకుని ఆపి, "ఎక్కడికి వెళ్ళేవు?" అన్నాడు కొంచెం కోపంగా సుందరం.

"మీ అమ్మతో చెప్పేనుగా! పోస్టాఫీసుకి వెళ్ళేను" అంది రాధ బెదరకుండా.

"ఏమిటంత అర్జెంటు? నిద్రలేచి నేనూ వొచ్చేవాడినిగా? అయినా, ఉత్తరం నాకో, లక్ష్మికో ఇస్తే పోస్టుచేద్దుంగా?దానికి నువ్వు ఊ రేగాలా?"

కొంచెం భయపడినట్టు అనుమానం కలుగజేసింది రాధ.

వెళ్ళి వెంటనే పోస్టుచేద్దా మనిపించింది" అంది.

"ఎందుకంత తొందర?" అన్నాడు ఈసారి కొంత అనునయంగా, సుందరం.

కళ్ళెత్తి అతని కళ్ళల్లోకి చూస్తూ. "అదే. పట్నంలో

ఇల్లు ఖాళీ చేయించి, వెల్లలు కొట్టించి వెంటనే తెలియజెయ్య మన్నాను..." అంది రాధ.

ఆ మాటలకీ, ఆమె సాన్నిహిత్యానికీ పూర్తిగా కరిగి పోయాడు సుందరం.

"దానికి అంత తొందర ఏమిటి? మనం వేరే ఇల్లు తీసు కోవొచ్చుగదా?" అన్నాడు.

"అది మీ ఇష్టం. కాని, ఇల్లు ఉండగా మీకు వేరే వెతికే శ్రమ ఎందుకు? అది నచ్చకపోతే ఎలాగా మరోటి తప్పదు" అంది రాధ.

ఆమెని చూస్తొంటే అతనికి ఊపిరి సలపడంలేదు అతనికి.

"సరేలే. ఆలోచిద్దాం" అని, ఆమె వెనకాలే లోపలికి వెళ్ళేడు. ఆమె కొంచెం పక్కకి వెళ్ళగానే, అమ్మకి జరిగిన సంగతి చెప్పేడు.

కాంతమ్మ ముఖంలో క్షణికంగా సంతోషం కనిపించింది. "అదీ మంచిపనే లేరా? ఇల్లు రడీ అయితే వెళ్ళిపోదాం" అంది.

కొంచెం ఇబ్బంది పడ్డాడు సుందరం. అక్కడ చిన్న ఇంట్లో తామందరూ వెడితే రోజులో కొద్దికూడా తానాశిస్తొన్న మధురక్షణాలు దొరకవనీ అతనికి మళ్ళీ మళ్ళీ అనిపించింది. ఇక్కడలాగే, రాధతో తియ్యగా రెండు మాటలు చెప్పుకోడా నికి కూడా అవకాశం దొరకదు. అంతేకాదు. ఇక్కడ వొస్తొన్న రాబడి తగ్గిపోతుంది. కట్నంకింద వొచ్చిన డబ్బు అమ్మ ఎలాగా ఇవ్వదు. దానిమీద వడ్డీలు ఏమైనా వస్తే...

"అదంతా ఆలోచించి చేద్దాంలే అమ్మా! ఈ ఇల్లు వదలాలని లేదు. తాతగారు కట్టించేరు కదా!...అదీకాక లక్ష్మికి చదువుకి ఇక్కడ బాగుంది. అక్కడ ఏ కాలేజీలో సీటు దొరుకుతుందో! దొరకనే దొరకదో!"

కాంతమ్మ అంత సుళువుగా లొంగిపోలేదు.

"ఎందుకు దొరకదురా!...అక్కడ అందరికీ దొరకడం లేదూ?" అంది.

"కాలేజీ తెరవగానే అయితే ఇస్తారమ్మా. మధ్యలో వెడితే వాళ్ళకి చాలా లంచాలు పొయ్యాలి."

ఆ మాట విని కొంతవరకూ లొంగింది కాంతమ్మ.

"ఆలోచిద్దాంలే" అంది. కాని ఆమె ముఖంలో చాలా అసంతృప్తి ఉంది.

ఆమెవేపు చూడలేదు సుందరం.

"అయినా, వయసొచ్చిన పిల్లకి పట్నం మంచిది కాదమ్మా. అందులోనూ లక్ష్మిలాగ, పట్నం అలవాటులేని వాళ్ళు అక్కడ రౌడీలతో పడలేరు...అసలే అమాయకురాలు అది..." అన్నాడు.

కాంతమ్మ ఏమీ అనలేదు. ఆవిడ ఆలోచనలో పడింది. కోడలు ఇంటికి రాగానే కొడుకు ఇలాంటి సలహా ఇవ్వడం ఆమెకి కొంత బాధా, ఆశ్చర్యమూ కలుగజేశాయి. లోక ప్రవృత్తి తెలిసిన మనిషే అయినా, తన కొడుకు అందరిలాంటివాడూ కాదని ఆమెకి చాలా విశ్వాసం ఉండేది. జీవితంలో ఆమెకి అనుభవం లేనిది ఎవరిమీదనైనా అధికారం చెలాయించడం.

కోడలు వచ్చాక ఆ అనుభవం రుచి చూద్దామని ఆమె ఆశించి నది ఇంత త్వరగా నిరాశ అవడం ఆమెకి బాధగానే ఉంది. కాని కొడుకు చెప్తున్నదానిలో కొంత నిజం ఉందనీ, స్వార్థంతో పాటు కొంత నిజం కూడా చెప్పి సుందరం తాననుకున్నంతా, తాను భయపడినంతా పరాయివాడు కాడనీ కూడా ఆమెకి అనిపించింది. వాడి వాలకం చూస్తోంటే తాడు లాగినకొద్దీ తెగడం భయం ఎక్కువ; ప్రయోజనం వేరే ఏమీ ఉండకపోవచ్చుననే భయం కూడా ఆమెకి కలిగింది. కాని, ఒక్కసారిగా వాడి మాటలకి తల ఊపడం కొంత చిన్నతనంగా భావించింది. "సరేలే-ఆలోచిద్దాం. ఇంకా నీ సెలవు ఉందిగా!" అంది. కట్నం మాట సుందరం ఎత్తుతాడనే భయం కూడా ఆమెలో ఉంది!

సెలవంతా ఇక్కడే ఖర్చుచెయ్యకూడదనీ, వీలైనంత వేగం రాధని తీసుకుని పట్నం వెళ్ళిపోవాలనీ అనుకున్న సుందరం ఆ విషయం ప్రస్తుతానికి వాయిదా వేశాడు. తన పథకం ఇంత సులువుగా పారుతుందని అతననుకోలేదు. కాని, అమ్మ మాటలతీరు చూస్తే ఆ విషయంలో ఆమె పరిస్థితిని అంగీకరించినట్టే ఉంది.

"కాలేజీకి వెడతానమ్మా! అన్నంపెట్టు" అంటూ వచ్చింది లక్ష్మి.

పెళ్ళికోసం కొన్న చీర తప్పితే లక్ష్మికి మరొక అపాటి మంచి చీర కూడా లేదని సుందరానికి తెలుసును. తనకీ మంచి రోజులటూ ఎప్పుడైనా వొస్తే, మొట్టమొదటి మంచి పనిగా

ఆమెకి నాలుగు చీరలు మంచివి కొనిపెట్టాలని అనుకున్నాడు. అయినా ఆమె కట్టుకున్న చీర మరీ హీనంగా ఉంది.

"అంతకన్న కాస్త మంచి చీర ఏదీ లేదా లక్ష్మీ?" అన్నాడు.

"ఒకటి ఉంది-కాని, ఎల్లుండి కాలేజీ ఫంక్షన్ ఉంది-దానికోసం ఉంచాను" అంది లక్ష్మి తినడం ఆపి.

"అలాగా?" అని ఊరుకున్నాడు సుందరం. రాధ దగ్గర చాలా చీరలున్నాయి. అవసరానికి మించి ఉన్నాయి. నిన్న రాత్రి నిద్రపోవడానికి ఆమె కట్టుకున్న చీర కూడా వంద రూపాయలకి పైనే చేస్తుంది. ఆమె వొంటిని ఉన్న నగలు కూడా తక్కువ ఏమీ కాదు...లక్ష్మికి సామాన్యమైన చీరా, రోల్డుగోల్డు నగలూ కూడా కొనలేకపోతున్నాడు తాను.

రాధని అడగాలనిపించింది లక్ష్మికోసం. కాని, పెళ్ళి అయి రెండురోజులు కూడా కాకుండా అలాగ అడగడం తనకి మరీ పరువు తక్కువ అనిపించింది. రాధ తన భార్య కావడం అనేక విధాల తన అదృష్టం...ఆమె దగ్గర డబ్బు కూడా ఉండే ఉండాలి. కాకపోతే పట్నంలో కాపురానికి అంత ఆత్రుతపడి పోదు.

లేచి వీధి గదిలోకి వెళ్ళేడు సుందరం. మరో ఐదు నిమిషాలకి లక్ష్మి కాలేజీకి వెడుతూ, తన చీర చూపించి, "వదిన ఇచ్చింది...ఇదీ మరో మూడూను" అంది.

"అలాగా!" అన్నాడు సుందరం.

"అవును...బాగుంది కదా?" అంది లక్ష్మి.

"చాలాను...వెళ్ళరా" అన్నాడు సుందరం. రాధ అంటే అప్పటికే అవధులుదాటి ఉన్న అతని మమత ఇంకా పెరిగిపోయింది. తిన్నగా లోపలికి వెళ్ళి రాధని చేతుల్లోకి తీసుకుని "నువ్వు చాలా మంచిదానివి. నేననుకున్న దానికన్నా కూడా చాలా మంచిదానివి" అన్నాడు.

అతని చేతులు విడిపించుకుని, "నేనేం అంత గొప్ప పని చెయ్యలేదు. మీరు గెడ్డం గీసుకుని స్నానం చెయ్యండి" అంది రాధ.

ఆ మాటలతో అతనిలో ఉన్న చిన్న ప్రేమికుడు భర్తకి స్థానం ఇచ్చేడు. ఏదో అనబోయి, ఊరుకుని అతనామె చెప్పినట్టు చెయ్యడానికి బయలుదేరేడు. ఇక్కడ ఉండగా రాధ రొమాంటిక్‌గా ఉండదని అతను నిర్ణయించుకుని అక్కడ ఇల్లు సిద్ధం ఎప్పుడవుతుందని రోజులు లెఖ్ఖపెట్టసాగేడు.

## 3

సుందరం ఎనిమిది రోజులు లెఖ్ఖపెట్టి తొమ్మిదో రోజున ప్రయాణం పెట్టేడు. ఆ ముందురోజే టెలిగ్రాం వచ్చింది - అక్కడ ఇల్లు సిద్ధం అయి వాళ్ళకోసం రడీగా ఉన్నట్టు. కాంతమ్మగారు తృప్తిపడేలాగ తిథీ వారమూ సరిపోతాన్న ఆ విషయంలో తర్జనభర్జనలట్టే జరగలేదు. ఉదయం రైల్లో బయలుదేరి చీకటి పడుతోంటే ఇంటికి చేరేరు.

రైల్లో ఇరుక్కుని కూర్చున్నారు. అదృష్టంకొద్దీ త్వరగానే కిటికీ పక్కకిచేరి కూర్చున్నాడు సుందరం. పక్కన తగిలీ తగలకుండా రాధ. ఆమెపక్కన మరో ఆవిడ. ఆమెతో ఏమైనా మాట్లాడేప్రయత్నంచేశాడుసుందరం.ఈఎనిమిదిపదిరోజులూరాధ అతనితో ఒకటి రెండుసార్లు అతి సామాన్య విషయాలమీదతప్ప మాట్లాడలేదు. తొలినాటినిద్ర మర్నాడు తననీ ఆమెనీకూడా వశంచేసుకోలేదు. అంచేత భర్తననిపించుకోగలిగాడు సుందరం. అంత అందాన్ని ఏం చేసుకోవాలో అతనికి బోధపడని పరిస్థితి... అది రాధ అర్థం చేసుకోలేదని అతనికి అనిపించింది. మొదట ఆమెలో వున్న ఉత్సాహం మళ్ళీ ఎప్పుడూ కనిపించలేదు. 'అనుభవం లేదుగా! క్రమంగా ఆమె బాగుపడుతుంది' అని సరిపెట్టుకున్నాడు. సుందరం తనలో లోపల రగులుతూన్న చిన్న అసంతృప్తిని ఆమెలోని ఆకర్షణ యిచ్చే తృప్తితో కప్పి వుంచాడు.

ఇంటికి వెళ్ళాక ఆమె తనతో స్వేచ్ఛగామాట్లాడుతుందని రైల్లో సరిపెట్టుకున్నాడు. రైలు దిగాక రెండు రిక్షాలు కుదిర్చాడు. ఒక్కొక్కరిక్షాకి నాలుగురూపాయలు...తాను బేరం ఆడి రెండున్నరకో, లేకపోతే మూడుకో కుదిర్చే ప్రయత్నం చేస్తోంటే రాధ తనకి అడ్డంవచ్చి నాలుగు అని వాళ్ళన్న రేటుకి వొప్పుకుని సరేనంది.

"అంత అనవసరం రాధా!" అన్నాడు.

"ఫరవాలేదు. దూరం తక్కువలేదుగా?" అంది రాధ.

రెండు రిక్షాల్లోనూ సామానుసర్ది ఇద్దరూ చెరో దాని

లోనూ కూర్చునే ఏర్పాటుకూడా చేసింది రాధ. ఇల్లు చేరేసరికి గంట పట్టింది. తాళంవేసి వుంది.

"సామాన్లు దింపించండి. తాళం తెస్తాను" అంది రాధ.

"ఎక్కడినించి?" అన్నాడు సుందరం.

"నాలుగిళ్ళ అవతల మాకు తెలిసినాయన ఉన్నాడు. క్షణంలో వస్తాను" అని బయలుదేరింది రాధ.

"ఉండు, నేనూ వొస్తాను" అని బయలుదేరబోయాడు సుందరం.

"ఫరవాలేదు. ఈ వీధి నాకుకొత్తకాదు. మీరు సామాన్లు చూడండి" అని, వెనక్కితిరిగి చూడకుండా వెళ్ళిపోయింది రాధ.

చీకటి పడిపోయింది. వీధి దీపాలు గుడ్డిగా వెలుగుతున్నాయి. కలవారి వీధి కాకపోయినా, మధ్యతరగతివాళ్లుండే ప్రాంతం కావడాన్న రోడ్డుమీద అట్టేమందిలేరు. ఒంటిన ఉన్న నగలు,ఆమె అందమూ,అతన్ని చాలా భయపెట్టేయి. ఈ మధ్య పేపర్లో అస్తమానం వొస్తోన్న వార్తలు అన్నీ అతనికి ఒక్కసారి జ్ఞాపకం వొచ్చాయి.

రిక్షావాళ్ళు సామాన్లన్నీ గేటులోనించి తెచ్చి తలుపు దగ్గర పెట్టి, "మా డబ్బు లిచ్చేయండి. పోతాం" అన్నారు.

నిమిషం ఆలోచించి, "ఆమెని రానివ్వండి......" అన్నాడు.

"మీరున్నారుగా! మరో బేరం చూసుకోవాలి" అన్నాడు ఒకడు.

"అయిదు నిముషాలు ఉండండి! అంత తొందర దేనికి? కొంచెం సాయంచేస్తే అన్నీ లోపల పెట్టుకుంటాం గదా!" అన్నాడు సుందరం కొంచెం మంచిగా. వాళ్ళు సరేనన్నారు.

సామాన్లలో ఒక చాపా రెండు దిండులు వున్నాయి.

సుందరానికి తన ఇంట్లో మంచం జ్ఞాపకం వొచ్చింది.

కొత్త యింట్లో యీ మొదటిరాత్రి నేలమీద చాపతో గడపాలి. అతనికి ఫోమ్ పరుపులూ స్ప్రింగ్ మంచాలు జ్ఞాపకం వొచ్చాయి. దరిద్ర స్వరూపమయిన తన పాతగది - నిజానికి దానిలో నాలుగోవొంతు-వొదిలిపోయి చిన్నదే అయినా యీ ఇల్లు తనకి దొరకడంలో ఆనందంకన్నా, రాబోయే రాత్రి చాప మీద గడపడంలోని బాధ అతనిలో యెక్కువ వుంది. రెండేళ్ళ నించీ బాధపెట్టని ఆ అలవాటు రాధ ఒళ్ళు తలుచుకుంటూ క్షణాలు గడుపుతోన్న అతనికి బాధగా వుంది.

రాధ వొచ్చేసరికి పదినిమిషాలు దాటింది.

రిక్షావాళ్ళు బీడీలు వెలిగించేరు.

అతనికీ ఒక సిగరెట్ కాల్చుకోవాలనివుంది. కానీ, దగ్గర లేవు.

"సామాన్లు లోపల పెట్టండి" అంది రాధ ఆ ముగ్గురనీ కలిపి ఆజ్ఞాపిస్తూ. రెండునిమిషాల్లో సామాన్లు లోపలికి వెళ్ళేయి. వాళ్ళిద్దరికీ ఆమె డబ్బు యిచ్చి పంపింది.

"నే నిచ్చేవాడినిగా?" అన్నాడు సుందరం వాళ్ళు వెళ్ళి పోయాక.

"నేనిచ్చానుగా?" అంది రాధ.

సుందరం యిల్లంతా కలియజూశాడు. వీధివైపు ఈ గది. నాలుగు కుర్చీలు చిన్న బల్లా ఉన్నాయి. లోపల మరో గది. అందులో మంచం, పరుపు, వున్నాయి. అవి చూడగానే సుందరం "వెరీగుడ్! నేలమీదపడుకోవాలని భయపడిపోయాను" అంటూ మంచంమీద కూర్చున్నాడు.

"కిచన్ అటు" అంది రాధ.

అదీ బాగుంది. అక్కడ గేస్ కూడా వుంది.

"దొరకడం కష్టమటగా! ఎలా వొచ్చింది?" అన్నాడు సుందరం. తన కళ్ళని తానే నమ్మలేకపోతున్నట్టు వుంది అతని ప్రవర్తన.

"డబ్బు వుంటే జరగని పనులు లేవు" అంది రాధ.

"అదీ నిజమే" అన్నాడు సుందరం.

"అదే నిజం" అంది రాధ, గంభీరంగా.

"అవును" అన్నాడు సుందరం.

"మరో గంటలో కేరియర్ వొస్తుంది...రేపు వెళ్ళి సామాను తెండి. వంట చేస్తాను" అంది రాధ.

"నీకు వంట వొచ్చునా?" అన్నాడు ఆమెని ఆసక్తితో గమనిస్తూ, సుందరం.

నవ్వి, "ఏం? బి. ఏ. పాసయితే వంట రాకూడదా?" అంది రాధ.

షాక్ తిన్నవాడిలాగ వుంది సుందరానికి.

"నువ్వు బి. ఏ. పాసయావా?" అన్నాడు.

"ఏం నమ్మరా? రేపు డిగ్రీ చూపెడతానులెండి" అంది రాధ. ఈసారి ఆమె నవ్వలేదు.

"అదేంకాదు...నాకు తెలీదు. అంతే" అన్నాడు సుందరం.

తన సూట్ కేస్‌లోనించి బట్టలు తీసుకుని రాధ స్నానానికి వెళ్ళింది. అతను ఆలోచిస్తూ మంచంమీదనే కూర్చున్నాడు. నిమిషం తర్వాత లేచి వీధిలోకి వొచ్చాడు. కొంచెం దూరంలో ఒక సిగరెట్ దుకాణం కనిపించింది. ఉన్నవాటిలో అతిచౌక పేకెట్ ఒకటి, అగ్గిపెట్టె ఒకటికొని, త్వరగా తిరిగివొచ్చి లోపలికి చూశాడు. రాధ యింకా స్నానం చేస్తోనేవుంది. సిగరెట్ వెలిగించి తృప్తిగా కళ్ళుమూసుకున్నాడు సుందరం. పదిరోజులైంది. అమ్మదగ్గర సిగరెట్ కాల్చడానికి కుదరదు. డబ్బు తగలేస్తున్నాడని తిడుతుంది.

సిగరెట్ పీలయినంతవరకూ కాల్చి చెయ్యి కాలబోయే ముందు అవతలపడేసి కుర్చీలో కూర్చున్నాడు. మరో అరగంట తరవాత వొచ్చింది రాధ. తల రుద్దుకొని, శుభ్రమైన బట్టలు వేసుకుని వుంది. కడిగిన ముత్యం అంటారు-ఇలాటివాళ్ళనే అనుకుని, సుందరం, "చాలాసేపు చేశావే" అన్నాడు.

"ఆ రైలు ధూళి ఒకపట్టాన వదలదుగా! సగం సబ్బు అరిగినా, ఇంకా ఒళ్ళు శుభ్రపడినట్టేలేదు" అంది రాధ మరో కుర్చీలో కూర్చుంటూ. తడితడిగా ఉన్నతల వొదులుగా ఆమె

భుజాలమీద పడుతోంది. గాజులుకూడా లేని చేతులు యెంతో సుకుమారంగా వున్నాయి. చాలాసేపు ఆమెని చూస్తూ వుండి పోయాడు సుందరం.

"ఏమిటలాగ చూస్తున్నారు?" అంది రాధ.

"నిన్ను"

"ఎందుకని?"

"నిన్ను చూడ్డానికి రెండుకళ్ళు చాలవన్నారు-అందుకు ఎన్ని కళ్ళైనా చాలవు-ఎంతసేపైనా చాలదు. అందుకని."

రాధ చిన్న నవ్వు నవ్వి ఊరుకుంది. అత ననుకున్నంతగా ఆ పొగడ్త ఆమెని సంతోషపెట్టలేదు.

నాలుగయిదు నిమిషాలతరవాత, "ఇందాకటినించీ యీ వాసన ఏమిటి?" అంది రాధ.

"ఏ వాసన?"

"సిగరెట్ లాగ. మీరు కాల్చరుగా?"

"అదా?- ఎప్పుడైనా కాలుస్తూ వుంటాను."

"ఇప్పుడు కాల్చేరా?"

"అవును"

చిత్రంగా అతనివొంక ఒకసారి చూసి తలతిప్పుకుంది రాధ. ఆమెకి సిగరెట్ వాసన చాలా అసహ్యం. కాని, అది ఎలాగ అతనికి చెప్పాలో ఆమెకి తెలీలేదు. అవసరం లేకుండా అతన్ని నొప్పించడం ఆమెకి ఇష్టమూలేదు.

మనిషి మీల్స్ కేరియర్ తెచ్చి యిచ్చి వెళ్ళిపోయాడు.

"డబ్బు తీసుకొని వెళ్ళు. ఎంతా?" అంది రాధ.

"బాబుగారు మీ దగ్గర తీసుకోవద్దన్నారు..." అన్నాడు మనిషి.

"అలాకాదు, ఆయనకి నేను చెప్తానుగా! ఎంతో చెప్పు" అంది రాధ.

"వొద్దమ్మా! ఆయనకి అసలే కోపం ఎక్కువ. చర్మం వొలిచేస్తానంటాడు-కావాలంటే ఆయనగారితో మీరు చెప్పండి" అంటూ మనిషి వెళ్ళబోయాడు.

"పోనీలే! అలా అంటూంటే బలవంతం చెయ్యడం ఎందుకూ?" అన్నాడు సుందరం.

పొరపాటుచేశాననుకుంది రాధ. ఏదో దూరపు వరస చుట్టంకదా అని యీ మాత్రం, అదీ అత్యవసర పరిస్థితిలో అతన్ని అడగవలసి వొచ్చింది. అతని వాలకం, మాటలు, ప్రవర్తనా రాధ కెప్పుడూ నచ్చలేదు. నాన్న ఏమయినా అనుకుంటారనిగానీ, అతని సంగతి చెప్పి వుండేది. ఏమీ తెలియకుండానే సుందరం ఇందులో అదీ అతనిపక్షాన కలుగజేసుకోటం ఆమెకి నచ్చలేదు.

"సరేలే!" అంది. మళ్ళీ "ఆగు" అని ఒక రూపాయి తీసి యిచ్చి "నువ్వు కాఫీతాగు" అంది. వాడి మొహంచూసి, "భూషణంగారికి చెప్పనుగా" అంది. రూపాయి తీసుకుని, "రేపొచ్చి కేరీరు పట్టుకెళతాను" అని చెప్పి వెళ్ళిపోయాడు అతను.

"పదండి-స్నానంచేసిరండి. భోజనం కానిద్దాం" అంది రాధ.

"ఈ అర్ధరాత్రి స్నానమా? చేతులు కడుక్కొస్తాను. భలే ఆకలిగావుంది. వొడ్డించు" అన్నాడు.

అయిష్టంగా అతనివేపు చూసి, బల్లమీద యిద్దరికీ వొడ్డించింది రాధ. సుందరం ఆత్రుతగా తిన్నాడు. ప్రతి పదార్థాన్నీ మరోసారి మెచ్చుకున్నాడు. రాధ మరీ కొద్దిగా తినడం అతను గమనించలేదు.

"ఈ సాంబారుందేం, రాధా, అరవలే చెయ్యాలనుకో! కాని, చూశావ్! మన తెలుగువంటలకి వాటి ప్రత్యేకతా వుంది. మన తాంళిపుకి జోడైంది యింకెక్కడా లేదు. ఈ కూర చూడు! వేస్టు చేశారు. నేనై తేనా...పచ్చి మిరప కారం పెట్టి వేపడం చేస్తే..."

"మీకు వంట వచ్చునా?" అంది రాధ.

ఆమె ఆశ్చర్యం చూసి చాలా సంతోషించేడు సుందరం. ఆమె బి. ఏ. కావడం కన్నా తనకి వంట రావడమే గొప్ప విషయం మరి.

"మామూలు వంటకూడా కాదు. ఆర్నెల్లు మెస్ నడిపాములే. అందరం కలిసి వంటచేసేవాళ్ళం. అంటే నేను చేస్తోంటే వాళ్ళు పక్క వాద్యగాళ్ళలాగ పక్కపనులన్నీ చేసేవారు. ఆ పచ్చడి కొంచెం ఇలా ఇచ్చి...ఇంక నీకొద్దా? సరే. నాచేతి వంటతిని వాళ్ళు గుండూల్లాగ తయారయారు. కాని-నా ఖర్చులు మాత్రం వాళ్ళతో సమానమేట. వొళ్ళుమండి వాళ్ళదారి వాళ్ళని చూసుకోమన్నాను..."

పెద్ద చప్పుడుచేస్తూ అతను భోజనం చేస్తున్నాడు. మధ్యలో రాధ వెళ్ళి చెయ్యి కడుక్కుని రావడం అతను గమనించలేదు. ఆకు అపరిశుభ్రం అయింది. గిన్నెలు పూర్తిగా ఖాళీ అయాయి. అప్పుడు లేచివెళ్ళి చెయ్యి కడుక్కున్నాడు.

గిన్నెలు, టేబిలూ శుభ్రంచేసి రాధ, "తమలపాకులూ వక్కా తెచ్చిపెట్టండి" అంది.

"ఏం నీ కలవాటా?" అన్నాడు సుందరం. అతను సిగరెట్ వెలిగించాడు.

"అవును. నాన్నగారికి అలవాటు. ఆయనతో నాకూ వొచ్చింది" అంది రాధ.

"అనవసరమైన అలవాటది! వెళ్ళి తేలేక కాదు. పదిహేను పైసలు నీకోసం ఖర్చుచెయ్యలేక కాదు. కాని, రోజుకి రెండుసార్లు వేసుకుంటే నెలకి పది. సంవత్సరానికి నూటఇరవై. పదేళ్ళ కాపురంలో పన్నెండువందలుఖర్చు. మరోలా అనుకోకు రాధా! మనం నెలకి రెండువొందల్లో తిని, బతికి, మిగిల్చి అమ్మకు పంపాలి...అదొక్కటే అనుకోకు. ఈ ఆకూ-చెక్కా అలవాటు రక్త రోగాలకి దారితీస్తుందిట. నీకేమైనా అయితే నేను భరించలేను" అన్నాడు సుందరం నాటకీయంగా. అలిసిపోయినట్టు కుర్చీలో వెనక్కి జారపడి, సిగరెట్ రెండు దమ్ములు లాగేడు.

చెంపదెబ్బ తిన్నట్టు చూసి, కళ్ళు తిప్పుకుంది రాధ.

సిగరెట్ వాసన ఆమెకి బాధగా వుంది.

ఈ మనిషికి ఆలోచన అంటూ లేదా? అనిపించింది ఆమెకి. ప్రతీ విషయానికీ, రూపాయిలూ పైసల్లో లెఖ్ఖ చూడడమూ, కొట్టవచ్చినట్టు కనిపించే స్వార్థమూ అతనిలో ఆమెకి కనిపించాయి.

లోపలి గదిలోకివెళ్ళి ఫేన్ పెట్టుకుంది.

పెట్టెలోనించి పుస్తకం ఒకటి తీసుకుని చదువుకో సాగింది.

అలిసి వుంది; అలాగే నిద్రపోయింది.

అతనిచేతుల వొత్తిడికి ఆమెకి తెలివి వొచ్చింది.

గాభరాగా, "ఏమిటి?" అంది. గదిలో చీకటిగా వుంది. మంచి నిద్రతో ఆమెకి కళ్ళు మైతో బరువుగా వున్నాయి.

"నేనే...కొంచెం అటు జరుగు" అన్నాడు"

సిగరెట్, చెమట కలిసిన వాసనకి ఆమెకి కొంత తెలివి వొచ్చింది. అతన్ని విదిలించుకొని లేచి కిందని నిలబడింది రాధ.

సుందరం ఆమె చేతులు పట్టుకుని తనవైపు లాక్కుంటు న్నాడు.

నిద్రమత్తు ఆమెని అశక్తురాలిగా చేసింది. వెళ్ళి మంచం మీద పడింది-రెండు మూడు నిమిషాలు పీడకలలాగ గడిచాయి. ఊపిరి బిగపట్టుకొని చివరికి లేచి నిలబడింది.

అతను నిద్రపోతున్నాడు.

రాధ వెళ్ళి స్నానంచేసివొచ్చి చాప వేసుకుని పడుకుంది.

దిండు వాసనగా వుంది. అది అతని మెడకింద పెట్టి అక్కడి దిండు తాను తీసుకుని చాలాసేపటి తరవాత నిద్రపోయింది.

నిద్ర వొచ్చేదాకా చాలా ఆలోచనలు రాసాగాయి రాధ మనసులో. అతను చేసినది ప్రతిరోజూ, ప్రతి రాత్రీ లక్షలాది యిళ్ళల్లో జరుగుతోన్న దేనని తెలిసినా, ఈసారికి అతన్ని క్షమించినా, మాటిమాటికీ అతన్ని క్షమించగలిగే శక్తి తనలో లేదని రాధ అనుకుంది.

కాని, ఏం చెయ్యాలి!

క్షమించడానికీ, క్షమించకపోవడానికీ అతనిలో చాలా వున్నాయి. అతను చేసేవాటినీ క్షమించాలి; భరించాలి; అతను చెయ్యలేనివాటినీ క్షమించగలగాలి.

చదువు, అందమూ, కొంత డబ్బు-అన్నీవుండి జీవితంలో మోసపోయేవారు కూడా బహుశా చాలామందే వుంటారు కాబోలు. అలాటివారిలో తానూ ఒకతె.

నాన్నకి గుండెజబ్బు. ఆయన ఎప్పుడుపోతాడో తెలీదు. తనకీ వయసు వొచ్చింది.

కాలేజీనిండా తన ప్రేమికులే!

వీధుల్లో ఎంతోమంది తనని ప్రేమించేవాళ్ళే!

"నువ్వు రాధవి

నేను కృష్ణుడు...

కలిసి మెలిసే వాళ్ళలాగే ఉందామా" అని ప్రతిగంటకీ కాలేజీలో వినిపించిన పాట.

అందరికీ తాను కావాలి.

తన అందం, తన శరీరం, తన మనసూ కావాలి.

తాను లోకజ్ఞానంలేని మనిషికాదు మరి. ఏ ఒక్కడు ముందుకు వొచ్చినా, ప్రత్యేకమైన లోపాలులేని మనిషైతే చాలు-పెళ్ళిచేసుకుందామనే అనుకున్నది. కాని, ప్రేమికులకీ పెళ్ళిళ్ళకీ పడదు. అది వారి సూత్రాలకి విరుద్ధం. తాను ఆడది కనక తన సూత్రాలంతగా ముఖ్యంకాదు మరి!

ఇద్దరు ముగ్గురు ముందుకు వొచ్చారు.

పెళ్ళిచూపులయాయి.

సరే నన్నారు.

రెండుసార్లు ముహూర్తం పెట్టేముందూ ఒకసారి ముహూర్తంకూడా పెట్టేరే! "క్షమించాలి; ఈ పెళ్ళిని అత్తగారు (లేక తల్లి; లేక తండ్రి) ఒప్పుకోవడంలేదు" అంటూ ఉత్తరాలు.

ముందర తనకి బాధా ఆశ్చర్యమూ కలిగాయి.

తరవాత క్రమక్రమంగా తెలిసింది. తండ్రి 'తక్కువ కులం దాన్ని' చేసుకున్నాడుట. తనని కని అమ్మ వెళ్ళిపోయింది. కొన్ని వివరాలు నాన్న చెప్పేరు. ఆ రోజుల్లో ఆయన అమ్మని ప్రేమించారు. దానికి పెద్దరభస అయిపోయిందిట. ఆయన్ని కులంవాళ్ళు వెలివేశారు. ఆస్తి ఇవ్వను-పొమ్మన్నాడు తండ్రి. ఇంక ఆమెమాట సరేసరి. ఆమె కుటుంబంవారూ, కులంవారూ ఆమెని దైహికంగానూ మానసికంగానూ చిత్రవధ చేశారు. కాని, చివరికి యిద్దరూ లేచిపోయారు. పెళ్ళి అంటూ వాళ్ళకి జరగలేదు. కాని ఆరు సంవత్సరాలు యిద్దరూ

యెంతో ఆనందంగా గడిపేను. నాన్న పెట్టిన వ్యాపారం బాగా అభివృద్ధి పొందింది. లక్షలకొద్దీ ఆర్జించాడు. అప్పటికి చితికి పోయిన తండ్రికి సాయం చేశారు. అది అంగీకరించినా, రాక పోకలు మాత్రం అంగీకరించలేదు వాళ్ళు.

ఆ తరవాత రాధ పుట్టింది.

రాధకి మూడోనెల రాకుండానే తల్లి చచ్చిపోయింది. ఆ ఆవేళ్ళ జ్ఞాపకాలతోనే ఈ యిరవై యేళ్ళూ నాన్న గడి పారు. వ్యాపారం క్రమంగా క్షీణించిపోయింది. తినగా తినగా ఏదో కొంచెం మిగిలింది. ఆయనకి మూడుసార్లు హార్టు ఎటాక్ వచ్చింది. అందుకే రాధ పెళ్ళికోసం ఆయన ఆత్రత. సుందరం వొచ్చినప్పుడు తనని చూపించే ముందరే ఆయన అతనికన్నీ చెప్పేరు. అయినా తనకి అభ్యంతరం లేదన్నాడు. సుందరం అతన్ని చూడగానే తనకి అతని రూపమూ, ఆస్తి లేకపోవ డమూ ఏమీ కనిపించలేదు. అతనిలో ఉన్నతి కనిపించింది. అందుకే తానూ సంతోషంగా అంగీకరించింది. అతని రాబడి అంత తక్కువ అని తనకి తెలీదు. కాని అతనిప్రేమలో యెంత తక్కువ రాబడిలోనయినా జీవించవొచ్చుననుకుంది. అతన్ని బ్రతిమిలాడి అయినా తన డబ్బు అతనికోసం ఖర్చుపెడదామని అనుకుంది. ఆ అవసరం లేకపోవడం ఆమెకి కొంత రిలీఫ్, కొంత ఆశ్చర్యం, కొంత అసంతృప్తి కలిగించాయి. కాని, త్వరగానే ఆ పరిస్థితిని అంగీకరించింది.

ఇప్పుడు ఆలోచిస్తుంటే, ఈ మనిషిని క్రమక్రమంగా

పరిశీలిస్తుంటే రాధకి తాను పెద్ద పొరపాటు చేశానేమోనని అనిపించింది.

కాని, మనుషులు మారతారు. మంచినించి చెడ్డకిలాగే, చెడ్డనించి మంచికిని.

అలా అనుకుని ఆమె నిద్రపోయింది.

# 4

పదిరోజుల్లో సుందరం, రాధ కొత్తజీవితానికి అలవాటు పడ్డారు.

సెలవు ముగిసి సుందరం ఆఫీసులో జాయిన్ కాగానే అత నంతకు ముందెవరికీ చెప్పకపోయినా, అతను పెళ్ళిచేసుకున్న వార్త అందరికీ తెలిసిపోయింది. అందరూ గుమిగూడి అతన్ని పార్టీ అడిగేరు.

"నేను గొప్పపని ఏదీ చెయ్యలేదుగా! అందరూ చేసేదే నేనూ చేశాను" అన్నాడు గడుసుగా, సుందరం. పాతిక రూపాయలిలా ఖర్చుకావడం అతనికి యిష్టంలేదు.

వారందరూ యెంత వాదించినా లాభంలేకపోయింది. కాని, పూర్వకాలపు రూమ్మేట్లు ముగ్గురిలో యిద్దరు ఆ ఆఫీసు లోనే పనిచేస్తూ ఉండడాన్న వాళ్ళబాధ తప్పించుకోలేక లంచ్

రైములో వాళ్ళకి ఒక్కొక్క స్వీటూ, ఇద్దరికీ కలిపి ఒక కారం, కాఫీ యిచ్చాడు.

ఆరోజే అతనికి ప్రమోషన్ రానున్న వార్త తెలిసింది.

మిగిలినవి ఎలాగవున్నా, ఆఫీసు పనిలోనూ, యు. డి. మొదలుకొని ఇంజనీరుదాకా అందరికీ వినయవిధేయతలు చూపడంలోనూ సుందరం చాలా నేర్పరి కావడాన్న అతనికీ అదృష్టం కలిసిరావడంలో గొప్ప ఆశ్చర్యం ఏమీ లేకపోయింది. కాని, అందరూ కలిసి సాయంత్రం మరోమారతన్ని చుట్టుముట్టేరు. అతనూ, శ్రీమతి కలిసి రావాలనీ, ఒకరోజు యీ రెండు శుభాలకీ కలిసి పార్టీ యివ్వాలనీ అన్నారు. "ప్రమోషను నిజంగా రానివ్వండి, చూద్దాం" అన్నాడు సుందరం.

సాయంత్రం ఇంటికి బయలుదేరేటప్పుడు కొత్త విచారం ఒకటి అతనికి పట్టుకుంది. పూర్వం గది ఆఫీసుకి రెండుమైళ్ళలో ఉండేది. నడిచివొచ్చి వెళ్ళేవాడు. ఇప్పుడు నాలుగుమైళ్ళు పైన వుంది. నడవడానికి మరీ దూరం. బస్‌లో వెళ్ళాలంటే యేభై పైసలవుతుంది. రోజుకో రూపాయిచొప్పున నెలకి పాతిక వొదుల్తుంది. దానికితోడు రాధ ఇవేళలాగ రోజూ టిఫిన్‌కూడా చేసి ఇస్తే అది మరో కొంత అవుతుంది. ప్రమోషన్‌వొస్తే నెలకి మరో ఎనభయిరూపాయలు వొస్తాయి. పి. ఎఫ్. పోగా డెబ్భైరెండు మిగుల్తాయి. కాని, కాస్త మంచి సీటు వొస్తే గౌరిపతిలాగ తానూ పదీ యిరవై చేసుకోవచ్చును. కాని, అవన్నీ ప్రస్తుతానికి కలలు.

ఆలోచించి ఆలోచించి చివరకి సగందూరంనడిచి ముప్పై పైసలు యిచ్చి మిగిలినదూరం బస్‌లో వెళ్ళి ఏడుగంటలకి ఇల్లు చేరేడు సుందరం. వెళ్ళేసరికి రాధ గుమ్మంలో నిలబడి యెదురు చూస్తోంది. వచ్చేపోయేవాళ్ళు ఆమెని పట్టి పట్టి చూసి మరీ వెడుతుండడం గమనించేడు సుందరం.

"ఇంత ఆలస్యం అయిందేం? అయిదుకేగదా ఆఫీసు వదిలేది?" అంది రాధ అతనితో లోపలికి వస్తూ.

"నువ్వు బయట నిలబడాల్సిన అవసరమేమిటి? దారిలో అందరి చూపులూ నీమీదే!" అన్నాడు సుందరం.

రాధ నవ్వి, "పోనిండి. సరదాగా చూసి వుంటారు మనకేం?" అంది.

"ఇది నవ్వులాటగాదు రాధా! అందరూ యేమను కుంటారు?"

నవ్వుతూనే, "ఏమనుకుంటారు?" అంది.

"రకరకాలుగా అనుకుంటారు."

"మీరు-మీరేమనుకుంటారు?"

"నామాటకేంలే. నే నొక్కణ్ణి నిన్నుగురించి మంచిగా అనుకుంటే సరిపోయిందా?"

"నాకది చాలు."

సిగరెట్ వెలిగించాడు సుందరం. రాధ నవ్వుతోనే వుంది.

"కాఫీ తెచ్చేదా?" అంది రాధ.

"వద్దులే."

"చేసి ఉంచాను. మరీ అలిసిపోయి ఉన్నారు. తాగండి."

"సరే చేశావు గనక. రేపటినుంచి వద్దు."

"ఏం?" అంది లోపలికి వెళ్ళి కాఫీ తెచ్చిఇస్తూ.

"అనవసరం. కాఫీ ఆరోగ్యానికి మంచిది కాదని డాక్టర్లు అస్తమానం చెప్తారు. అదీగాక ఇంకో గంటలో భోజనం చేస్తాముగా!"

"పోనీండి. రేపట్నించి మీకివ్వను!"

"నువ్వు తాగొద్దు" అనబోయి ఊరుకున్నాడు సుందరం. మరి కొంతకాలం ఆమెకి స్వేచ్ఛ కొంత అయినా ఇవ్వడం మంచిది అనుకున్నాడు.

"రాత్రి-సినిమాకి వెడదామా? — వంట అయిపో వచ్చింది..." అంది రాధ.

"రెండో ఆటకా?...వద్దు, చాలా రిస్కు. అయినా, రేపు ఆఫీసు ఉందిగా! మరో రోజు చూద్దాంలే" అన్నాడు సుందరం. ఈమె కోరికలు వింటోంటే అతనికి భయం పుడుతోంది. పైకైనంత వరకూ రానున్న ప్రమోషన్ గురించి ఆమెకి చెప్పగూడదనుకున్నాడు.

రాధ వెళ్ళి వంటపని ముగించింది.

కంచంలో చూసి "ప్రతిరోజూ ఇన్నెందుకు? సాంబారా-ఏదైనా పచ్చడీ చాల్లే. ఇంకా ఎక్కువ ఉంటే వేస్తు" అన్నాడు సుందరం.

"కూర లేకుండానా?"

"కిలో మూడు నాలుగూను! ఊరగాయ తెచ్చేవుగా! చాలదూ?"

"ప్రయత్నిస్తాను" అంది అయిష్టంగా రాధ. ఆమెకి కూర ఉండితీరాలి.

"నీకు అనవసరంగా శ్రమ తగ్గుతుంది."

"అవును."

"ఉన్నదానిలో సరిపెట్టుకోవాలి."

ఈ ఊరు రాగానే మొదట కొన్న పప్పులూ ఉప్పులూ గిన్నెలూ అన్నీ రాధ డబ్బు పెట్టి కొంది అనీ, లాంఛనంగా నయినా ఎంతయింది అని తానడగలేదనీ అతనికి జ్ఞాపకం వచ్చింది. కాని, ఆ విషయంలో చర్చ అనవసరం అని ఊరుకున్నాడు.

భోజనం చేస్తోంటే ఆఫీసులో పార్టీ అడిగిన మాట చెప్పేడు.

"ఏమన్నారు?" అంది రాధ మరికొంచెం అన్నం వడ్డిస్తూ.

"పనిలేకపోతే సరి? వీల్లేదని చెప్తే ఒప్పుకోలేదు వాళ్ళు-అందుకని చూద్దాంలే అన్నాను."

"సరే అనలేకపోయారా?... స్నేహితులు గదా! అసలు పెళ్ళికే పిలవాల్సింది.

"అనవసరం ఖర్చులెందుకు రాధా! మనం ఇద్దరం కలిసి

ఇవ్వాలిట పార్టీ. నాకిలాంటివంటే తలనొప్పి...నువ్వు భోజనం చెయ్యడంలేదేం?" అన్నాడు శ్రేణుపుతో తినడం ముగించి చెయ్యి కడుక్కుంటూ.

"తరవాత తింటాను."

"అదే మంచి పద్ధతి...నిజానికి వడ్డిస్తూ తినడం, తింటూ వడ్డించడం రెండూ కష్టమే!" తన జోక్ చాలా నచ్చింది సుందరానికి. పెద్ద నవ్వుతో లేచి వెళ్ళేడు.

వేరే కంచంలో మిగిలినది పెట్టుకుని తిని రాధ పుస్తకం చదండంలో నిమగ్నమైపోయింది. క్రమంగా ఆమెకి చాపమీద అలవాటైపోయింది. అతని గుర్రు కూడా అలవాటయింది. చిన్న చిన్న విషయాలలో జీవితాన్ని బాధామయం చేసుకోవడం కన్న సరిపెట్టుకోడం నేర్చుకుంటే ఇటు తనకీ అటు తండ్రికీ కొంత అయినా సంతోషం మిగులుతుందనే నిర్ణయానికి వచ్చిన రాధ ప్రతినిమిషమూ జీవితంతో పోరాడుతోంది. ఆ పోరాటం అంతా తన లోలోనే జరుగుతోంది. బయటికి ఏమీ తెలియనీకుండా జాగ్రత్తపడుతోంది. కళ్ళ ఎదురుగా ఉన్నదానినే గుర్తించలేని మనుషులు హృదయాల అంతరాంతరాలలో నిశ్శబ్దంగా కొనసాగుతోన్న సమరాలని అసలే గుర్తించలేరని రాధకి తెలుసును. కాని ఆమెలో హృదయం ఉంది. ఆశ ఉంది. ధైర్యం ఉంది.

శారీరకంగా అతను చాలావరకు దూరంగా ఉండడం ఆమెకి కొంత శక్తిని ఇచ్చింది. మొదటి అనుభవాలు ఆమెలో కలిగించిన ఆశాభంగం, జుగుప్సదానితో కొంత తగ్గాయి.

అదంతా జీవితంలో ఒక భాగం. బహుశా, చిన్న భాగం. జీవితంలో మిగిలినవైనా కలలుగా కరిగిపోకుండా జాగ్రత్తపడడం ఆమె ప్రయత్నం. అందుకే, ఒక్కొక్కసారి అతని మాటలూ, ప్రవర్తనా, ముల్లులాగ గుచ్చుకున్నా, ఊపిరి బిగపట్టి ఆ క్షణాలని వెనక్కి నెట్టుకోవడం ఆమె నేర్చుకొంటోంది.

ఆ రాత్రి రాధ బాగా నిద్రపోలేకపోయింది. మర్నాడు ఉదయం లేచేసరికి ఆలశ్యం అయింది. వంట ముగిసేసరికి తొమ్మిది.

అసహనంతో, చిందులు తొక్కడం మొదలు పెట్టేడు సుందరం. అతనితో ఈ కొన్నిరోజులూ నిద్రించి అప్పుడు మేలు కొన్న ఈ కొత్త భీకరరూపం ఆమెని చాలా భయపెట్టింది. పుట్టిన తరవాత తననలాగ కోపించినవాళ్ళూ, తనమీద కేకలు వేసినవాళ్ళూ లేరు.

అతను అడ్డూ ఆపూ లేకుండా ఏదో అరుస్తున్నాడు. ఉండీ ఉండీ గొణుగుతున్నాడు.

లోపలినించి దుఃఖమూ కోపమూ కలిసి ఆమెని ఉక్కిరి బిక్కిరిచేసి చేస్తోన్న పని మరింత పాడు చేస్తున్నాయి.

ఏమైనా అందామని ఉంది; కాని, ఒకవైపు తన నిర్ణయాలు, మరొకవేపు ఎంతో కిందికి దిగిపోయిన ఆత్మాభిమానమూ అవన్నీ కాక గొంతుకకి అడ్డువడిన చిక్కటి బాధా ఆమెని మాటలాడనివ్వలేదు. ఆమె ఏమీ అనకపోవడం అతన్ని మరింత ఉడికించింది. యివేళ పూర్తిగా బస్‌లో వెళ్ళాలి... వెళ్ళినా ఆలశ్యం కావచ్చు. ప్రమోషను రావాల్సిన రోజులు...

ఎలాగో భోజనం అయిందనిపించి సుందరం తొందరగా వెళ్ళేడు. అప్పటికి తొమ్మిదిన్నర.

స్నానం చేసి, పుస్తకం పట్టుకుని చాలా సేపు కూర్చుని తరవాత భోజనానికి కూర్చుంది రాధ. చాలా తక్కువ ఉంది. కాని అదికూడా తినలేకపోయింది. ఆ తరవాత చాలాసేపు నిద్ర పోయింది.

ఆ తుఫానునించి కొంత సర్దుకునేసరికి వారంరోజులు పట్టింది రాధకి. ఆ సాయంత్రంనించీ సుందరం ఏమీ జరగనట్టే ప్రవర్తించాడు. ఆమె కొంత ఉదాసీనంగా ఉన్నా, ఆ సంగతి అతను గమనించినట్టే లేదు. ఆమెలో ఏమీ జరిగినా, దాని ఫలితం ఆతనిమీద ఉండదనే ఆమె గుర్తింపు మరింత బలవత్తరం అయింది.

ఆ వారమూ గడిచాక రాధలో ఒంటరితనపు బాధ మరి కొంత ఎక్కువ అయింది. యిక్కడికి వచ్చాక ఆమె గడపదాట లేదు! కిటికీలోనించి కనిపించేదీ, పుస్తకాలు మనసుకి తెచ్చేదీ మాత్రమే ఆమె ప్రపంచం. ఇంతకు ముందామెకి సినిమాలంటే విపరీతమైన సరదా ఉండేది. యిక్కడికి వచ్చాక ఒకసారి అడిగి కాదనిపించుకున్నాక మళ్ళీ ఆ మాట ఎత్తడానికి ఆమె ఇష్టపడ లేదు. అతనూ ఆ మాట ఎత్తలేదు.

ఆ తరవాత కొంచెం రోజులు మామూలుగా గడిచాయి. తండ్రి ఆరోగ్యం బాగానే ఉన్నట్టు ఆ రోజు ఉత్తరం వచ్చింది.

మరోవారం పది రోజుల్లో వస్తాననికూడా రాశాడు. రాధ చాలా ఆనందంగా ఉంది. ఆ సాయంత్రం సుందరం కూడా హుషారుగా ఉన్నారు. అతని ప్రమోషన్ విషయం నిర్దిష్టంగా తెలిసింది.

"ఏమిటంత సరదాగా వున్నావు?" అన్నాడు కుర్చీలో కూర్చుని.

"నాన్నగారు ఉత్తరం రాశారు."

"అలాగా! గుడ్!"

"ఆరోగ్యం బాగుందిట."

"మంచిమాట రాశారు."

"వారం పదిరోజుల్లో వస్తారుట."

"చాలా సంతోషం అనిరాయి."

"అలాగే."

"అది సరేగాని, ఒకసారి మనం సినిమాకి వెళ్ళాలి... రేపు ఆదివారం వెళ్దామా?" ఆ రోజు అతను కాదన్న సంగతి జ్ఞాపకం వచ్చి "ఎందుకులెండి! డబ్బు దండగ" అంది రాధ.

"అదీ నిజమే. మా అమ్మ అన్నట్టు-పుణ్యమా పురుషార్థమా?"

"అవును. ఏమీ లేదు."

"నువ్వు చాలా తెలివైన దానివి రాధా!"

పొడిగా నవ్వి, "నా తెలివి తేటలకేంగాని, రేపు వెళ్ళి పప్పులూ ఉప్పుడూ బియ్యమూ నూనె పంచదారా తేకపోతే సరుకులు లేవు" అంది రాధ.

"అప్పుడే నిండుకున్నాయా?...నెల మధ్యలో ఎలాగ తేను?" అన్నాడు సుందరం.

బజారుకి వెళ్ళి తెండి. ఇవేళకి ఫరవాలేదు. రేపు మాత్రం తప్పదు."

సుందరం లెఖ్ఖ వేశాడు. కిందటినెల అమ్మకి పంపగా మిగిలినదంతా రేపు సరుకులకే అయిపోయేలాగ ఉంది. కాని, ఏం చెయ్యడం ఈ మధ్య ఖర్చులన్నీ రాధ పెడుతోంది...ఆమె ఎంత తెచ్చిందో తెలీదు. చెప్పలేదు. తాను అడగనూలేదు. అడిగితే తన మర్యాద నిలవదు. బహుశా ఆమె దగ్గరకూడా డబ్బు అయిపోయి ఉంటుంది.

రాధ ఏదో రాస్తోంది. ఉత్తరం కాబోలు ననుకున్నాడు.

"ఏమిటంత శ్రద్ధగా రాస్తున్నావు?" అని అడిగాడు సుందరం.

"లిస్టు, మీరక్కడికి వెళ్ళాక తప్పులు చేస్తే ఎలాగ?"

"చూడనీ."

"ఒక్క నిమిషం ఆగండి."

పూర్తిచేసి అతనికి ఇచ్చింది లిస్టు.

అన్నీ చదివేసరికి అతనికి మతిపోయింది.

సబ్బులు : నాలుగు...

ఇంతకుముందు ఒక్క సబ్బు రెండేసి నెలలు వచ్చేది. రాధ మరీ అన్యాయం రోజుకీ రెండుసార్లూ, ఒక్కొక్కప్పుడు

మూడుసార్లూ స్నానం చేస్తుంది. ప్రతీసారీ సబ్బుతో తోము కుంటుందిలా ఉంది.

అలాటివే చాలా వున్నాయి. తాను పుల్లతో పళ్ళు తోముకుంటాడు. ఆమెకి బ్రష్, పేస్టూ కావాలి. తలనూనె. ఇంకా, ఇంకా.

చాలాసేపు లిస్టుచూస్తూ కూర్చున్నాడు సుందరం. చివరకి, కొన్ని తెచ్చి కొన్ని తేకుండా వచ్చి ఆమె ఏమైనా అంటే పొదుపుమీద ఒక ఉపన్యాసం ఇవ్వాలని అనుకున్నాడు.

మర్నాడు సాయంత్రం అత్యవసర వస్తువులు మాత్రం తెచ్చి ఇచ్చాడు.

రాధ అన్నీ చూసి, ఏమీ అనలేదు.

సుందరమూ ఇంక ఏమీ అనలేదు. ఆమె ఏమైనా అంటే చూసుకోవచ్చులేనని ఊరుకున్నాడు.

# 5

"భూషణం రాధ తండ్రి రంగారావుకి ఏదో దూరపు చుట్టం. అతని ఇల్లు రాధ ఉన్న ఇంటి వీధిలోనే ఉంది. రంగా రావు బాగున్న రోజుల్లో ఆ స్థలం కొనిపించి ఇల్లు కట్టించడానికి తానే కారణం అని తరుచు జ్ఞాపకం చేస్తూ ఉంటాడు భూషణం.

అందులో కొంత నిజం లేకపోలేదు. అయితే, ఆ బేరంలో చాలా డబ్బు తినేశాడు అని రంగారావు రాధకి చెప్పేడు. అదీకాక భూషణం రకరకాల వ్యవహారాల మనిషి. అతను చాలామందిని నమ్మించి డబ్బు కాజేశాడనీ, బయటికి రాకూడని వ్యాపారాల్లో ఆయన చెయ్యి ఉందనీ అందరూ చెప్పుకుంటారు. ఈ మధ్య సినిమావాళ్ళతో కూడా యేదో సంపర్కం పెట్టుకుని ఒకరిద్దరు ప్రొడ్యూసర్ల కొంపలు ముంచాడనికూడా అక్కడా అక్కడా చెప్పుకుంటూ వుంటారు. రంగారావుకీ అది తెలుసును. కాని, భూషణం దగ్గర జాగ్రత్తగా ఉండడం కన్నా ఆయన చర్యలేవీ తీసుకోలేదు. ఇల్లు వ్యవహారం కాక మరొక్కసారి అతని మాటమీద రంగారావు మరో చిన్న వ్యాపారం చేశాడు. అందులో రెండువేల పైచిలుకు భూషణం కాజేశాక మరికొంత నష్టానికి ఒప్పుకుని రంగారావు విరమించుకున్నాడు. కాని, ఇక్కడ యీ యిల్లు ఉండడానా, పూర్వపు చుట్టరికం దృష్టిలో పెట్టుకునీ అతను భూషణాన్ని ఏమీ అనలేదు. కాని, అతనికి భూషణం రహస్యాలు కొన్ని తెలుసును. భూషణం అతనికి దూరంగా వుండి, గౌరవించడం నేర్చుకున్నాడు.

రాధ ఆ యింట్లోకి వచ్చాక అతని యింటికి వెళ్ళలేదు. అతనంటే ఆమెకి ఒకరకమయిన భయం. ఎందుకో ఆమెకే తెలీదు. కానీ అతని భార్య సీత అంటే రాధకి చాలా అభిమానం. ఒకసారి సీతవొస్తే బాగుండునని అనుకుంది రాధ. కాని ఇన్నాళ్ళవుతున్నా సీత రాలేదు. భూషణం కొడుకు కుమార్

అని పిలవాలనిపిస్తుంది. సీత పిన్ని ఎలాగ ఉంది?" అంది రాధ.

"బాగానే వుంది. నిన్నొకసారి పిల్చుకురమ్మంది. చాలా సొల్లు చెప్పిందిలే. కాని, కొత్తకాపురం-పానకంలో పుడకలాగా ఎందుకులే అని నేను ఊరుకున్నా ఆవిడ ఊరుకోలేదు. అది సరే గానీ, అలాచిక్కిపోయా వేం? ఈనీళ్లు నీ ఆరోగ్యానికి పడలేదా?" అన్నాడు తాపీగా చుట్టవెలిగిస్తూ భూషణం.

"నేను బాగానే వున్నాను."

"అది నిజమేలే. నువ్వెప్పుడూ బాగానే ఉంటావు. మీ అమ్మ అందం అంతా నీకు వచ్చింది. దానికి వడ్డీమీద వడ్డీ వస్తున్నట్లు అది రోజురోజుకీ ఎక్కువౌతోంది!" అంటూ వంకరగా ఒక చిరునవ్వు నవ్వేడు భూషణం. అతని మనసులోని నలుపంతా ఆ ముఖంలోనూ కళ్ళలోనూ ప్రస్ఫుటం అయ్యేలాగ నవ్వేడు.

"కూచో. టీ తెస్తాను" అని లేచింది రాధ.

"నేను టీ తాగనుగా! కాఫీ ఇయ్యి" అన్నాడు భూషణం.

"సరే" అని రాధ లోపలికి వెళ్ళింది. ఉన్న కొంచెం గుండతో కాఫీచేసి తెచ్చింది. తాగి, మెచ్చుకుని, "గొప్పగా వుంది. నువ్వు తెచ్చుకోలేదేం?" అన్నాడు భూషణం.

"సాయంత్రం తాగుతానులే. ఈ టైములో నా కల వాటు లేదు" అంది రాధ.

నవ్వి, "పెళ్ళి అయాక చాలా మారిపోయావు రాధా!

నీ కాఫీ అలవాటు నాకు తెలీదని చెప్పకు. ఆయనగారితో కలిసి తాగాలని కదా! అలాగే చెయ్యి. కాకపోతే ఈ ఒక్కసారీ నాతో కలిసి తాగాలని ఉంటుందనుకున్నాను. నా బేడ్ లక్ ..." అన్నాడు భూషణం.

రాధ మాట్లాడలేదు. ఇతనింక వెడితే బాగుండును అనుకుంది.

"ఆ ప్రొడ్యూసర్ల మాట చెప్తూ ఊరుకున్నాను-వాళ్ళు పిక్చర్ తీస్తున్నార్లే. అందులో హీరోగారి చెల్లెలు పాత్ర ఒకటి ఉంది. ఆ అమ్మాయి-అదే, కథలో-అపురూప సుందరి. ఇప్పటిదాకా వాళ్ళకి ఏ మొహమూ నచ్చలేదు. నిన్ను చూసేటప్పటికి వాళ్ళిద్దరికీ ఒక్కసారి మతిపోయి వి. స్క్రీన్ టెస్టు కూడా లేకుండా బుక్ చేసుకుంటారట.

"థేంక్స్ బాబాయ్! కాని నాకు సినిమాలు వద్దులే."

"అంత తొందరపడకు రాధా! మీ ఆయన్నీ అడిగి చూడు. పాపం! ప్రమోషను వచ్చినా అతని దరిద్రానికి అంతం లేదు. కప్పు కాఫీ తాగడానికి పంచవర్ష ప్రణాళిక అంత హంగామా. నానా అవస్థా పడుతున్నాడు.

"ఆయనకి ప్రమోషన్ వచ్చిందా?" అంది రాధ అప్రయత్నంగా. వెంటనే నాలిక కరుచుకుంది.

"ఏం? చెప్పలేదా?... పుట్టినరోజున నీకు బహుమతి తెచ్చి ఆరోజు చెవిలో చెప్తాడు కాబోలు. పెళ్ళయిన వేళా విశేషం. సంవత్సరానికి గాని రాదనుకున్న ప్రమోషన్ నెల తిరక్కుండా వచ్చింది. ఈ పిక్చర్లో నువ్వు చేశావంటే ఓ! చూడు!

వద్దన్నా-సూపర్ హిట్ పిక్చరది, నీ గుమ్మంముందు క్యూలో నిలబడతారు ప్రొడ్యూసర్లు."

"నా కిష్టంలేదులే..."

"అలా కొట్టిపారెయ్యకు రాధా! మీ నాన్నకి గుండె జబ్బు తప్ప మిగల్లేదు. నువ్వు పాపం! ఇక్కడ పడ్డావు. చీర కొనాలంటే, సినిమా చూడాలంటే ఆలోచించి, డబ్బులు లెక్కచూసి మానెయ్యాల్సి! పదేళ్ళుపోతే ఈ అందం వుండదు. ఆ మోజు పోకుండానే, అర్జించుకోవాలి. చెప్పేనుగా! మీ ఆయన్ని అడిగి చూడు."

నీరసంగా లేచి చుట్టముళ్ళీ వెలిగించి పొగలు వొదులుతూ వెళ్ళిపోయాడు భూషణ్. పనిమనిషి లోపలికివస్తూ, "చుట్టాలా అమ్మా?" అంది.

"ఆఁ! చుట్టలూ, చుట్టాలూను" అంది నిట్టూరుస్తూ రాధ. ఈ భూషణ్ తనని చాలా యిరకాటంలో పెట్టేడు. ఆయన్ని గురించి ఆరాతీసినట్టు వున్నాడు. ఈ సినిమా అవ కాశం మాట ఆయనకి చెప్తే? వీధిలో నిలబడితేనే సహించలేని వాడు అంతమందిలో వేషాలు వేసి నటించడానికి అంగీకరించక పోవచ్చు. ఆ డబ్బు చూసి యీ అనుమానాలని మరచిపోనూ వచ్చును. లేదా ఈ మాట తెలియగానే అతను మరింత అను మానంతో తన జీవితాన్ని ఇంకా నరకం చెయ్యవచ్చును. ఏ మనిషి ఏ పరిస్థితిలో ఎలాగ చేస్తాడో చెప్పడం కష్టం. ఆ చేసే వాటికి ఫలితాలు ముందే తెలుసుకోవడం యింకా కష్టం.

తల దిమ్ముగావుంది. కాఫీ తాగితే బాగుండును. కాని, ఇంట్లో పొడిలేదు. పనిమనిషిని పంపి కొంచెం కాఫీపొడితెప్పించి కాఫీ చేసుకుని తాగింది రాధ. ఈ మనిషికి నెలకి మూడురూపాయలని చెప్తేనే 'అయినా ఈ మాత్రం సంసారానికి పనిమనిషి కూడా ఉండాలా' అన్నాడు సుందరం. నిజానికి నెలకి పాతిక రూపాయలు తీసుకొంటూందని తెలిస్తే అతనిక యేమైనా అనొచ్చు! భోజనం తగ్గినా బాధలేదుగాని రాధ గిన్నెలు తోమడం మాత్రం చెయ్యలేదు. చేతులు సుకుమారంగా వున్నాయనే కాదు; అలాగే ఉండాలని ఆమె కోరిక. ఆ నొప్పి భరించలేదు. నిజానికి యెలాటి మంటలూ నొప్పులూభరించలేదు రాధ.

నాన్న వస్తే బాగుండును. ఉత్తరం రాసి వారం రోజు లయింది. ఈవేళో రేపో అయినా రావాలి. వస్తే భూషణం చెప్పింది చెప్పాలి...ఈలోగా ఆయనకి యిష్టమయిన వేపైనా చెయ్యడానికి సరంజామా తెచ్చుకోవాలి. ఇవేళ కుదరదు. రేపు.

దగ్గర వున్న డబ్బు చాలా తక్కువగావుంది. నాన్న వచ్చాక తీసుకోవాలి.

పనిమనిషి వెళ్ళిపోయింది.

రాధకి ఈరోజు మరీ అసంతృప్తిగా వుంది. బజారుకి ఏ రెండు మూడు రోజులకో ఒకసారి వెళ్ళడం తప్పితే బయట యెలా వుందో తెలీదని మళ్ళీ అనిపించింది ఆమెకి. ఈనుధ్య మరీ

ఊపిరి సలపటంలేదు. పుస్తకాలు తెచ్చుకుంది గనక కాని, లేక పోతే యీ సరికి పిచ్చి ఎత్తేది.

లైబ్రరీలో చేరాలి. అలా అయితే కనీసం ఈ కాలక్షేప మైనా కొంత కాలంపాటు వుంటుంది.

సుందరం ప్రమోషను వొచ్చినమాట ఎందుకు చెప్ప లేదో! జీతం ఎక్కువ అయిందంటే తాను అడుగుతుందనా? అంత నీచంగా ఆలోచిస్తాడా? చాలావాటికి తానే ఖర్చుచేస్తోందని అతనికి తెలుసు. అయినా ఇంకా...

అశాంతిగా వుంది రాధకి.

భూషణం నిజానికి ఎలాటి మనిషి!

వొలుచుకు తినేలాగ చూస్తాడు తనవంక. అది చాలా మందికి ఉండే జబ్బే. బాబయ్యా అని పిలవడం కిట్టదు.

"భూషణం ఏంచేసినా అందులో పూర్తిగా స్వార్థం ఉంటుందమ్మా! అతనేం చెప్పినా ఒక మోసంలో మొదటి మెట్టుగానో రెండోమెట్టుగానో తీసుకుంటే క్షేమం" అన్నాడు తండ్రి ఒకసారి ఏదో సందర్భంలో.

అతనేదో ఎత్తుమీదనే వచ్చాడు.

పెద్ద యెత్తు. ఎందుచేతనంటే, చాలా శ్రమపడు తున్నాడు.

ఏమిటది?

తాను అందంగా వుంటానని ఆమెకి తెలుసు. చిన్నప్పుడు స్కూల్లో ఒకసారి కృష్ణుడివేషం వేసిందట. నాన్న చెప్పేవారు. అది జ్ఞాపకం తెచ్చుకుని మురిసిపోవడం ఆయనకి సరదా. తనకి

జ్ఞాపకమే లేదు. అది తప్ప తనకి అనుభవంలేదు. సినిమావాళ్ళకి తనమీద కన్నుపడేంత ప్రత్యేకత తనలో ఏమీలేదు. ఇదంతా భూషణం పన్నుగడలో భాగం అనుకుంది రాధ. అతని మనసు లోని చీకటిదారుల్లో ఏదో ఒక దానిలో యీ పథకం వుంది.

న్యాయంగా ఇదంతా సుందరానికి చెప్పి అతనినించి సలహా, రక్షణ తీసుకోవాలి. కాని, సుందరానికి ఈ వార్త ఎలాటి భావన కలిగిస్తుందో ఆమెకి తెలీదు. దైహికంగానేకాదు; మానసికంగా కూడా అతనికి చాలా దూరంగానే తాను ఉన్నా నని రాధకి తెలుసును. నేడో రేపో తండ్రి వస్తే చూసుకో వచ్చులే అని ఊరుకుంది రాధ. ఆయననించి మళ్ళీ ఉత్తరంలేదు. వస్తున్నట్టు టెలిగ్రామూలేదు. ఆయన ఎందుకు రాలేదో! ఈ బాధ ఆమెలో క్రమంగా ఎక్కువ కాసాగింది.

ఆ రాత్రి సుందరం కొంచెం మారినట్టు కనిపించింది ఆమె కళ్ళకి.

రోజులాగ భోజనంచేసి వెళ్ళి నిద్రకి ఉపక్రమించలే దతను. ఆమె వడ్డిస్తూంటే వద్దనకుండా తిని లేచేమనిపి యివేళ ఆమెనీ తనతో కూర్చోమన్నాడు. పదిరోజులనించి తనమీదలేని ధ్యాస ఈ రోజు కలిగినట్టుంది అనుకుంది రాధ. ఆ కొద్ది నిమి షాలు తన విధి నిర్వర్తించడం ఆమెకి పెద్ద గండంలాగ వుంది. విశ్రాంతి దొరికినకొద్దీ ఆ అనుభవం ఆమెకి చేదెక్కుతోంది. ఏం చెప్పి తప్పించుకోడమా అన్న ఆలోచనలో పడింది.

కాని సుందరం ఉద్దేశం వేరుగా వుంది.

ఆరోజు అమ్మ దగ్గరనించి అతనికి ఉత్తరం వచ్చింది.

ఇంటికి అత్యావసరంగా రిపేర్లు చేయించాలి, లేకపోతే రాబోయే వర్షాకాలంలో ఒకటి రెండుగోడలు పడిపోయే ప్రమాదం ఉంది. అదీకాక పెంకులు తిరగవేసి నేయించకపోతే వర్షాల్లో తలదాచుకునే యోగం ఉండదు. ఏడెనిమిది వందలు అర్జంటుగా కావాలి...

అది ఆమె ఉత్తరంలో మొదటి భాగం.

ఆ ఇల్లు అమ్మితే తలదాచుకోడానికి పట్నంలో అతని ఇల్లు తప్ప ఆస్కారం ఉండదు. వడ్డీయేమో పెరిగిపోతోంది. ఏలాగేనా పదివేలు కావాలి. తనదగ్గర ఉన్న కట్నం డబ్బు ఇంటి ఖర్చులకి క్రమంగా ఖర్చు అవుతూంది. ఎలాగోలాగ ఏర్పాటు చేసి సంవత్సరాంతంలోగా ఆ పదివేలూ జతచేసి తేవాలి. లేకపోతే దిక్కులేనివాళ్ళయి పోతారు-అతని పంచకే వచ్చి తలదాచుకుంటారు.

అది మిగిలిన భాగం.

ఉత్తరం నాలుగుసార్లు చదివి చాలా బాధపడ్డాడు సుందరం. అమ్మమీదా చెల్లిలిమీదా అతనికి విపరీతమైన అభిమానం. వాళ్ళికక్కడికొస్తే వాళ్ళకీ తనకీ కూడా సుఖం ఉండదు. అదీకాక ఆ ఇల్లు తమ చెయ్యిదాటి పోకూడదనే కోరిక అతనికి చాలా గాఢంగా ఉంది. అమ్మకి ఆ ఇల్లు అంటే ప్రాణం అని అతనికి తెలుసును.

ఇన్ని వందలూ, ఆ వేలూ తన కెక్కడనించి వస్తాయి?

ప్రమోషను వచ్చాక కాస్త 'తడి' ఉన్న సీటు దొరికితే కొంచెం మెరుగ్గా ఉంటుంది. ఇప్పటికే రాధ ఆ సామానూ ఈ సామానూ అని చాలా ఖర్చు పెట్టిస్తోంది. అది అసలు లేక పోతే పరువుపోతోంది గనక కొన్ని అయినా తెచ్చి పడేయక తప్పదు. ఇంతకు ముందులాగ-అంటే పెళ్ళి అయి సంసారం పెట్టేలాగ కూడా మిగలడం లేదు.

కాని, రాధ దగ్గర చాలా డబ్బు ఉండితీరాలని అనుకున్నాడు సుందరం. లేకపోతే తాను కొనని సామాన్లన్నీ ఇంట్లోకి ఎలాగ వస్తున్నాయి? రోజూ కూరలెలా వస్తున్నాయి? మామగారి దగ్గర చాలా ఉందని అతను అంచనా వేశాడు. ఏనుగు చచ్చినా వెయ్యి రూపాయిలన్నట్టు చతికిపోయిన ఆయన దగ్గర యింకా చాలా ఉండితీరాలని అనుకున్నాడు సుందరం. తానూ రాధా కాక ఆయనకి ఉన్నదెవరూ? యివేళ కాకపోతే రేపైనా తనకి రావల్సిందే కదా! అది యివాళే అయితే పోలేదూ ?

అనుకున్న కట్నం ఇచ్చేక ఇంకా ఇవాల్సిన న్యాయం ఏముందన్న ప్రశ్న సుందరం వేసుకోకపోలేదు. కాని, 'కులం' తక్కువ పిల్లని తాను చేసుకున్నాడు. ఆ ఒక్క కారణానికే అడిగిన దెంతైనా ఇచ్చి ఉండేవారు. వాళ్ళన్నదానికి తానూ అమ్మా అంగీకరించారు. అదీకాక-ఆమె చాలా స్వేచ్ఛతో పెరిగింది. ఈ కాలపు అమ్మాయిలు చిన్నప్పట్నించీ సాహస కృత్యాలు చేస్తూ ఉంటారని చాలామంది అతనికి చెప్పేరు. ఆ విషయం చాలా పుస్తకాలలో అతను చదివి నేర్చుకున్నాడు

కూడా. పెళ్ళి ముందర ఆమె ఏమి చేసిందో అతను విశాల హృదయంతో అడగనేలేదు. ఇప్పుడు ఆమెకి ఎంత స్వేచ్ఛ ఇస్తున్నాడని? ఉదయం పోతే రాత్రి రావడం-మధ్యన ఆమె ఏం చేస్తుందో తనకి తెలీదు. రాత్రి కూడా ఆమె వేరుగా పడుకుంటుంది. తన అవసరాలు చాలా తక్కువ కనక ఆ విషయం అతను హృదయ వైశాల్యంతో క్షమించాడు. కాని, మరో మొగుడైతే అలాగ ఆమెని దూరంగా ఉండనిచ్చేవాడా?... తాను కాబట్టి దానికి ఆమె కృతజ్ఞత చూపడానికి ఒకేమార్గం ఉంది. డబ్బు. అది ఆమె కన్నా తనకే ఎక్కువ ఉపయోగం.

అంతరాంతరాలలో సుందరం మరో ఆలోచన పెట్టుకున్నాడు. ఆమెకి తన భార్యకాగల అర్హత నిజానికి లేదు. అదీ కాక ఆమె అనవసరమైనంత చదువుకొంది. తన మూలాన ఆమెకి గృహిణిగా గౌరవం లభించింది. ఆమెకి ఉండవలసిన దానికన్నా ఎంతో ఎక్కువ స్వేచ్ఛ ఉంది. తాను ఇంట్లో లేని సమయాలే నిజానికి చాలా ఎక్కువ. వాటిలో ఆమె ఏం చేస్తోందో? అంతా ఆలోచిస్తే మానవశరీరం చాలా హీనమైనది. అనేక కోరికలకి అది పుట్టిల్లు...ఇన్నాళ్ళూ తాను ఆమెని కనిపెట్టి ఉండడంగాని, ఆమెమీద ఎలాటివీ ఆంక్షలు విధించడం కాని చెయ్యలేదు. భూషణం వచ్చి తనని కలిసి ఇంటికెళ్ళి రాధని చూసినట్టు చెప్పేడు. ఆమె ఆ విషయం తనకి చెప్పనే లేదు. అతనిమాటే చెప్పకపోతే, అంతకన్నా గోప్యంగా ఉంచాల్సిన అతిథులు ఎవరెవరో వచ్చి ఉండడం అసంభవం ఏమీ

కాదు...పరిస్థితుల వల్లనైతేనేం, తన నైజం వల్లనైతేనేం, ఆ విషయాలలోకి తాను తరిచి తరిచి పరీక్షించడం జరగబోయే పనికాదు. మరి ఏదో వండిపడేయడం, ఆ ప్రయత్నంలో తన జీతం హరింపజెయ్యడంకాక రాధ తనకి చెయ్యగలిగేది ఆర్థికంగానే. నిజానికి ఆమెనించి డబ్బు తీసుకుంటూన్నందుకు రాధ కృతజ్ఞురాలిగా ఉండాలి.

ఈ ఆలోచనలే ఆ రాత్రి అతని మనసులో ఉన్నాయి.

ఆమె మామూలుగా పనులన్నీ ముగిసేక వచ్చి చాప మీద పడుకుని పుస్తకం తెరిచింది. లోలోపల ఆమెకి భయంగా ఉంది. అతని చెమట వాసన, ఆ దిక్కుమాలిన సిగరెట్ల వాసన, ఆమె భరింపలేదు.

"ఇదిగో రాధా! ఇలారా" అన్నాడు అతనిదగ్గర ఉన్న మార్దవం అంతా పెట్టి. అతనిలో అప్పటిదాకా ఉన్న సుగుణం అదొకటి. అనవసరంగా కటువుగా మాట్లాడడు.

"ఎందుకు?...ఈ చాప్టర్ అయిపోనీండి." అంది రాధ గుండెని గట్టిగా చేసుకుంటూ. అతనిలో ఉన్న అంత తక్కువ కోరికని కాదని లేని కసిని అతనిలో కలిగించాలని లేదు ఆమెకి. రెండు నిమిషాలకోసం—కాకపోతే మరోసారి స్నానం. అంతేగా!

"అది కాదులే- నీతో మాట్లాడాలి" అంటూ కూర్చు న్నాడు సుందరం.

తేలికపడి, పుస్తకం పక్కకిపెట్టి తానూ కూర్చుంది రాధ.

కొంచెంసేపు ఎలాగ ప్రారంభించాలోనని ఆలోచిస్తూన్నట్టు ఆగి, "అమ్మ ఉత్తరం రాసింది" అన్నాడు సుందరం.

"బాగున్నారా? లక్ష్మి బాగా చదువుకుంటుందా?"

"ఏదో అలాగే, అక్కడి పరిస్థితులు నీకు తెలుసును గదా! దాని పెళ్ళి- అది అయితే గాని అమ్మకూ శాంతి ఉండదు. నాకూ ఉండదు..."

"నిజమే..."

"అసలే ఆడపిల్ల పెళ్ళి కష్టం. అందులో-రాధా! నువ్వేమీ అనుకోకు. నా ఉద్దేశం చెప్పడంలేదు - అందులో అందరూ నువ్వేదో కులం తక్కువ దానివని అనుకుంటున్నారుట. అందుచేత దానికి సంబంధం రావడం కష్టంగా ఉంది..."

రాధ మాట్లాడలేదు.

"దానికేంలే! నువ్వేం బాధపడకు. మరో వెయ్యో రెండువేలో గుంజేప్రయత్నం అది. అంతేకాని- ఇంటి రిపేరు వెంటనే చేయించాలిట. వచ్చేది వర్షాకాలం...ఇప్పుడు పని చేయించకపోతే -వంద అయేదగ్గర తరవాత మూడు వంద లవుతాయి. దానికి వెంటనే పంపమని రాసింది...నా దగ్గర ఏమీ లేదు. సంసారంలోనే పడుతోంది జీతం అంతా...మనం ఎలాగైనా పంపాలి..."

"నా దగ్గరా లేదు...ఇగవై యో పాతికో ఉన్నాయి అంతే" అంది రాధ.

"అంతేనా!" అన్నాడు సుందరం ఆశ్చర్యపోయి.

"అవును...కావలిస్తే చూసుకోండి" అంది రాధ.

"ఛా! నువ్వేం చెప్తే అది నమ్ముతాననుకదా! ఎప్పుడైనా ప్రశ్నలడిగానా?" అన్నాడు ఎంతో నొచ్చుకున్నట్టు. అత నన్న దానిలో కొంత నిజం ఉందని రాధకి తెలుసును.

"మరి...?" అంది రాధ.

"నువ్వే చెప్పాలి రాధ! రెండేళ్ళ కిందట అమ్మ దగ్గర ఒక గాజులజత అమ్మేసి కొంత రిపేరు చేయించాం...ఇంక ఇంట్లో నగలేమీ లేవు...ఇల్లు కూలిపోతే...నాకూ, ఆ ఇంటి కోడలికీ తలదాచుకోడానికి ఓ పంచ అయినా ఉండదు..." అన్నాడు. పెళ్ళి అయాక అన్నిమాటలు ఒక్కసారి మాట లాడడం అతనికీ అదే మొదటిసారి అని గుర్తించింది రాధ.

"నేను-ఏం చేసేది?" అంది రాధ.

"ఆలోచించు...వాళ్ళూ ఇక్కడికి వొచ్చేడం ఒకటే మార్గంలాగ ఉంది. అయినా నువ్వూ ఆలోచించు...అప్పుడు అమ్మ గాజులజత అమ్మకుండా ఉంటే...ఇప్పుడీ సమస్య వచ్చేది కాదు..." అని, సుందరం నిద్రకి ఉపక్రమించాడు.

కట్నంకింద ఇచ్చిన అయిదువేలూ ఏమయ్యాయి?

తాను తెచ్చిన నాలుగైదు వందలూ సంసారంలోనే పడ్డాయిగా!—మరి అతని జీతంలో మిగిలినదంతా ఏమౌతోంది.

ప్రమోషను వచ్చిన మాటైనా చెప్పలేదు. ఆ జీతంలో పెరుగుదలా, బయటదొరికేదీ అన్నీ ఏమౌతున్నాయి ?

అని అడగాలనిపించింది రాధకి. ఆ నిమిషంలో సుందరం తనని కేవలం డబ్బుకోసమే చేసుకున్నాడని ఆమెకి బలంగా

అనిపించింది. క్రమంగా తన మీద అభిమానం పెంచుకుంటాడనే ఆశ చావలేదుగాని నీరసించింది.

ఎప్పుడో వచ్చి ఉండాల్సిన నాన్న రాలేదు...ఉత్తరం లేదు.

ఆలోచిస్తూ నిద్రపోయింది రాధ.

# 6

ఆ వారం అంతా తండ్రికోసం ఎదురుచూస్తూ గడిపింది రాధ.

సుందర మళ్ళీ ఆనాటిమాట ఎత్తలేదుగాని ఏ రోజైనా ఆ విషయం మళ్ళీ ప్రస్తావనలోకి వచ్చేటట్టు కనిపిస్తోంది. తండ్రి వస్తే ఆయనేదో ఒకటి చేసి ఉండును...

చివరికి ఉన్న రెండు జతలలోనూ ఒకటి అమ్మింది.

ఆమె షాపులోనించి ఎనిమిది వందల రూపాయలు తెస్తోంటే కనిపించాడు భూషణం. నిమిషంలో జరిగినది పసికట్టి ఆమె వెనకాలపడ్డాడు.

"నా మాట కాదన్నావు. సంసారం అన్నాక అవసరాలు ఉండకపోతాయా? సుందరం రోజుకి పదీ ఎనిమిదీ పైన తెచ్చుకుంటూన్నా ఏ మూలకి రాధా! అందుకే- నీకూ, నీ

అందానికి సరిపోయే మాట చెప్పేవు. ఆ గాజులు తెచ్చుకో. డబ్బియ్యి- నేను తెస్తాను. రేపు కాంట్రాక్టు మీద సంతకం పెట్టు...నాలుగు వేలో అయిదు వేలో అడ్వాన్సు తీసుకో..." అంటూ ఆమె కాదనడాన్ని గమనించనట్టే, అక్కరలేదు అని ఆమె మాటిమాటికీ అననట్టే-ఇంటిదాకా వచ్చాడు.

"నాకు సినీమాలు వద్దు బాబాయ్! ఇలాగ హింసించకు" అంది రాధ.

"సిరి వస్తే చీదరించుకుంటావేం రాధా!—సుందరంతో మాట్లాడతాను...నువ్వు అతనికి చెప్పనేలేదుగా!" అన్నాడు భూషణం.

"ఆ పని చెయ్యి బాబాయ్! నాన్న కోపం నీకు తెలుసును. ఆయన నేడో రేపో వస్తారు. నీకు చెయ్యగలిగిందంతా చేస్తారు" అంది కోపంగా రాధ.

"కోపం వద్దు రాధా! నీ మంచికే చెప్పేను." అన్నాడు భూషణం కొంచెం తగ్గి.

"నా మంచి చూడడానికి ఆయన ఉన్నారు. నాన్న ఉన్నారు. నువ్వు శ్రమ తీసుకోకులే బాబయ్యా!" అంది రాధ.

నిప్పులు కురిపించే చూపొకటి చూచి భూషణం వెళ్ళిపోయాడు. ఈమెని సాధించి తీరాలని అతనికి తెలుసును. శ్రమ లేకుండా కమిషన్ వస్తుందని అనుకున్నాడు. కొంచెం శ్రమ పడాలి...అంతే.

దీనికి కీలకం సుందరం అని గూడా అతనికి తెలుసును.

అతను వెళ్ళగానే రాధకి తండ్రినించి ఉత్తరం వచ్చింది. మళ్ళా కొంత ట్రీట్‌మెంట్ తీసుకుంటూ ఉండడాన్ని వెంటనే రాలేనని ఆయన రాశాడు. త్వరలోనే ఆరోగ్యం కొంత బాగు పడగానే వస్తాననీ రాశాడు.

కొంత ఉపశమనం కలిగినా రాధకి కొంత బాధకూడా కలిగింది.

ఆ సాయంత్రం మామూలుగానే ఆలశ్యంగా వచ్చాడు సుందరం. అతనికి తండ్రి ఉత్తరంమాట చెప్పింది రాధ.

విని, "ఆయన బాగుండాలనే ఆశిద్దాం...కాని, పెద్ద వాడు కదా! అందులో ఇలాటి అనారోగ్యం. మరీ ఆశ పెట్టుకోకు" అన్నాడు సుందరం.

అలా అంటాడని అనుకోని రాధ బాధపడింది. ఎందుకన్నాడోనని ఆలోచించింది. కాని అంతుపట్టలేదు.

మర్నాడు ఉదయం అతను ఆఫీసుకి వెడుతోంటే అతనికి ఏడువందలు ఇచ్చింది.

మాట్లాడకుండా లెఖ్కపెట్టి, "ఇంతేనా?" అన్నాడు.

"ఒక వంద ఉంచుకున్నాను" అంది రాధ. అతని ప్రశ్న తీరు చూస్తే చేయరానిదేదో తాను చేసినట్టనిపించింది ఆమెకి.

"ఎందుకూ?" అన్నాడు సుందరం డబ్బు చేతిలోనే వుంచి.

"ఏవైనా-ఖర్చులుంటాయి..." అంది రాధ.

"పది ఉంచుకో. చాలు" అన్నాడు సుందరం.

ముల్లు గుచ్చుకున్నట్టు వుంది రాధకి. లోపలికి వెళ్ళి ఆ వందకూడా తెచ్చి ఇచ్చింది.

లెఖ్ఖపెట్టి, ఎనిమిదివందలూ జేబులో వేసుకుని వెళ్ళి పోయాడు సుందరం. రాధకి కొంత బోసిపోయిన చేతులూ, అతని ప్రవర్తనా కన్నీళ్ళు తెప్పించాయి.

ఆ తరవాత అత్తగారు అతనికి రాసిన ఉత్తరం ఆమె కంటపడింది.

చదివి రాధ తెల్లబోయింది.

ఉన్నదానికి లేనివి కల్పించి చెప్పాడన్నమాటసుందరం.

మొదటిసారిగా అతనిమీద చాలాఅసహ్యంవేసింది ఆమెకి. సుందరం దరిద్రంతో బాధపడుతున్నాడని రాధకి తెలుసును. కాని, పెళ్ళి అయాక అతను భర్తలందరిలాగా వుండి కొంచెమైనా ఆప్యాయత చూపిస్తాడని రాధ ఆశపడింది. భార్య అనే కాదు...తాను చాలా అందంగా వుంటానని ఆమెకి తెలుసును కాని—అతను మరీ తనదగ్గరి డబ్బుకోసమే చూస్తున్నాడు. తనూ అతనికి అక్కర్లేదు. దీనికామె ఒక్కసారే సంతోషించ డము, విచారించడమూకూడా చేసింది. శారీరకంగా అతను దగ్గరగావస్తే భరించలేదు. కాని అతనంత సుళువుగా దూరంగా ఉండిపోవడం ఆమెకి చిత్రమైన అసంతృప్తిని కలుగజేసింది. అటు తండ్రి ఆరోగ్యం సరిగాలేకా యిటు కులం పట్టింపుతో ఎవరూ తనని పెళ్ళిచేసుకోడానికి ముందుకిరాకా-తండ్రి బెంగ తగ్గించడానికే, సుందరంలో సరిదిద్దలేని లోపాలేవీ కనిపించకా, ఆమె పెళ్ళికి సంతోషంగానే ఒప్పుకుంది. పెళ్ళికి ముందు చాలా

మంది సౌందర్యారాధకులయిన యువకులు ప్రేమని ఆఫర్ చేశారు. అది ప్రేమ మాత్రమే... పెళ్ళి కాదు. పెళ్ళి అయాక ఇక్కడ ప్రేమలేదు.

ఏమి జీవితం! అని నిట్టూర్చింది రాధ. ఆమెకి ఏడవాలని పించింది. కాని-ఆ పరిస్థితిలో ఏడుపైనా రాలేదు.

ఆ మర్నాడు ఆమె చాలాసేపు ప్రయత్నం లేకుండానే ఏడిచింది.

తండ్రి పోయాడు-అప్పటికి వారంరోజుల కిందట. ఆ వార్తా, అతను చివరి ఘడియల్లోరాసిన చిన్న ఉత్తరమూ, ఒక చెక్కూ ఆమెకి రిజిస్టర్డ్ పోస్టులో వచ్చాయి. నాలుగువేల ఆరు వ దలకి చెక్కు. అది-ఈ యిల్లు అప్పటికే రాధ పేరున వుంది-ఆయన చివరిగా ఆమె కిచ్చినది. ఇంక ఆయనా ఉండడు. ఆదా యమూ వుండదు. అంతకన్నా ఆమెని భయపెట్టిన ఆలోచన ఏమిటంటే, తనకి మిగిలిన ఆసరా సుందరం ఒక్కడేననే ఆలోచన.

ఆ రాత్రి సుందరం రాగానే వార్తచెప్పి భోరున ఏడ్చింది రాధ.

"ఊరుకో...ఊరుకో ... పాపం! పెద్దవాడు. వెళ్ళి పోయాడు ... మరి - నీకు అన్యాయం చెయ్యలేదుగదా?" అన్నాడు సుందరం.

రాధ తెల్లబోయి చూసింది.

"అదే. దేశంగాని దేశంలో పోయాడు పాపం. అతని ఆస్థి అది..."

రాధ చెక్ చూపెట్టింది.

పరీక్షగా చూసి, "అంతేనా?" అన్నాడు సుందరం.

"అంతే?" అంది రాధ దుఃఖం ఆపుకుంటూ.

"ఇంకా-చాలా వుండాలిగా!" అన్నాడు చాలా అసంతృప్తితో సుందరం.

రాధ మాట్లాడలేదు.

"అమ్మా నేనూ-ఆ డబ్బుతో ఇంటి అప్పుతీర్చి లక్ష్మిపెళ్ళి ఎలాగ చెయ్యడం? - కానీలే... రేపిది సంతకంపెట్టి ఇయ్యి" అన్నాడు సుందరం.

రాధకి ఈసారి తన పరిస్థితి పూర్తిగా తెలిసివచ్చి దుఃఖం హద్దులు మీరిపోయింది. అందుకే ఆమెకి ఏడుపు రాలేదు. ఆ పూటకూడా హోటలుకి దండగ ఖర్చు కూడదనడాన్న ఆమె వంటచేసింది. ఆ మంటలవేపు చూస్తూనే వుంది. ఆమె లోపలకూడా అంతకన్నా వేడి ఆమెని దహించేస్తోంది.

వండిందంతా వదనకుండా తిని నిద్రపోయాడు సుందరం.

ఆ మర్నాడు డ్రాఫ్టు తీసుకుని సంతకం పెట్టించుకుని వెళ్ళేడు అతను. అది కేష్ అయేసరికి వారంరోజులు పట్టింది. డబ్బుపట్టుకుని వూరికివెళ్ళి అమ్మచేతిలో పెట్టాడు. ఇద్దరూ కలిసి కొంతసేపు విచారించారు-ఇంకా ఎక్కువలేదని.

"ఖర్చు అయింది కాక అందులో కొంత మిగిలిందికదా! అదీ యిదీ కలిసి ఆరువేలైనా వుంటుంది...ఇంటిమీద కొంత తీరుస్తాను. వడ్డీ అయినా తగ్గుతుంది...మరో నాలుగువేలతో ఇల్లు మనది అవుతుంది" అంది కాంతమ్మ.

"నాకూ మంచి సీటు వచ్చిందిలే...ఏమయినా దొరుకుతుంది. ఎలాగో చూద్దాం. కాకపోతే - దాన్ని ఉద్యోగం చెయ్యమంటాను" అన్నాడు సుందరం.

"పట్నంలో ఆడదానికి ఉద్యోగం ఏమిట్రా? అంతమంది మగాళ్ళ మధ్యన?" అంది లక్ష్మమ్మ కొడుకుని జాగ్రత్తగా పరిశీలిస్తూ. కోడలతన్ని కొంగున కట్టేసుకుంటుందేమోనని ఆమె భయం.

"ఇంట్లో ఒక్కర్తీ వుంటుంది కదా! ఏంచేస్తేఎవరికెరుక! ఆపాటిదానికి ఆఫీసుకే వెళ్ళొచ్చుగదా! లేకపోతే మరో పని చెయ్యొచ్చు" అన్నాడు సుందరం. రెండ్రోజులకిందట భూషణం అతన్ని 'రహస్యంగా' కలిశాడు. మాటవరుసకి అభ్యంతరంచెప్పి, అతనిచేత కొంత బతిమాలించుకొని-'సరే చూద్దాం' అన్నాడు సుందరం. అతనికి కొత్తఆశలు పుడుతున్నాయి.

ఆ రాత్రి అక్కడేవుండి మర్నాడు బయలుదేరి తిరిగి వచ్చాడు. వచ్చేసరికి రాధ లేదు. అరగంట అతను బయట కూర్చుని ఎదురుచూశాక వచ్చింది.

"అయ్యో! సరిగ్గా యిప్పుడే వచ్చారా?" అంది తాళం తీస్తూ.

"నువ్వు సరిగా నేను వచ్చేముందరే వెళ్ళేనంటావు" అన్నాడు ఆమె మాట నమ్మని విషయం దాచకుండా, సుందరం.

రాధ మాట్లాడలేదు.

"వెళ్ళిన పనులయ్యాయా?" అన్నాడు సుందరం సిగరెట్ వెలిగిస్తూ.

"సీతమ్మగారి యింటికెళ్ళేను. ఆమెకి బాగోలేదు" అంది రాధ.

"సీతమ్మగారో, రామయ్యగారో!" అన్నాడు సుందరం.

అతని కళ్ళల్లోకి సూటిగా చూస్తూ, "అవి మీ నమ్మకమా?" అంది.

"నాకేం తెలుసును? నువ్వు స్వేచ్ఛకి అలవాటుపడ్డ మనిషిని-నిన్ను కనిపెడుతూ కూర్చోడానికి నాకు టైమ్‌లేదు. ఓపికాలేదు. సరేగాని-తినడానికేమైనా ఉందా?" అన్నాడు సుందరం.

"ఏదో చేస్తాను. ఇంట్లో అన్నిసామాన్లూ లేవు" అంది రాధ.

"ఉన్నది చెయ్యి" అని, నిద్రకి ఉపక్రమించాడు సుందరం-తన మాటలు ఆమెలో రేపిన సంచలనాన్ని గురించి ఆలోచనే లేనట్టు.

రెండు రోజుల తరవాత సుందరం ఆమె ఏదయినా పని చేస్తే కాస్త కాలక్షేపం అవుతుందని సూచనగా అన్నాడు.

"ఏం పనీ?" అంది రాధ.

"ఏదైనాను-చదువుకున్నదానివి. ఎన్నాళ్ళని యింట్లో కూర్చుంటావు?" అన్నాడు సుందరం.

"అవును. ఏదయినా గుమాస్తా ఉద్యోగం దొరుకుతుందేమో చూడండి" అని రాధ.

"అంత సుళువుగా దొరుకుతాయా! నిరుద్యోగ సమస్య యెలా ఉందో తెలుసుగా!...కాని, ప్రయత్నిద్దాం. నువ్వు నాలుగింటికి దరఖాస్తులు పెట్టు...పక్కవారి నడిగితే వేపరిస్తారు" అన్నాడు సుందరం.

"అలాగే" అంది రాధ. ఆమెకి ఈ ఆలోచన బాగుంది కాని ఒక్కసారి అతనికి ఇలాటి బుద్ధి ఎందుకు పుట్టిందో ఆమెకి తెలీడంలేదు.

"నీ అందం చూసి అయినా ఎవరో చిన్న ఉద్యోగం యివ్వకపోరు..."

"అలాటిది నా కక్కర్లేదు" అంది రాధ.

"మరి అంత అందం యేంచేసుకుంటావు?...ఎప్పుడైనా ఉపయోగ పడాలికదా! - లేకపోతే సినిమాల్లో చేరరాదూ? ఎవరినయినా అడుగుతాను" అన్నాడు సుందరం.

మెరుపులాంటి ఆలోచనవచ్చి, "ఏం, భూషణం మాట్లాడేడా?" అంది రాధ.

"ఒకనాడు వచ్చాడులే. నీకు చుట్టం కదా! అంచేత నాకూను..." అన్నాడు సుందరం.

"ఎంత యిచ్చాడు?"

"ఏభై..." అని, నాలిక కొరుక్కున్నాడు సుందరం.

ఆమె చాలా హఠాత్తుగా అడిగింది. ఆలోచన లేకుండా జవాబు యివ్వవలసి వచ్చింది.

నాలుగైదు నిమిషాలు రాధ మాట్లాడలేదు.

"ఆ ఏభై కీ-ఏం చెయ్యాలిట మీరు?" అంది రాధ.

"ఏమీలేదు. ఊరికినే ఇచ్చేడు. నీకు పువ్వులు కొని పెట్ట మన్నాడు. నాకు తండ్రిలాంటివాడు కదా! కాదనలేక పోయాను. పోనీలే, అభిమానంగా ఇస్తే వద్దనకూడదని తీసు కున్నాను. అంతే...అయినా, అతను చెప్పినదాంట్లో తప్పే ముంది?" అన్నాడు సుందరం సగం తర్కం, సగం అనునయం మిళితం చేస్తూ.

"నాకు ఆ సినిమా జీవితం యిష్టంలేదు" అంది రాధ.

"ఎందుకని?"

"అక్కడ జరిగేది మీకూ తెలుసును. అందరూ...మరీ ఫ్రీగా ఉంటారు."

"అది నాగరికం మరి! దానిలో అంత పెద్ద తప్పేమి వుంది? వేలకి వేలు వచ్చిపడుతుంటే - ఆ పాటి చిన్న విషయం పట్టించుకోనక్కరలేదు."

"ఆ విషయాలు చిన్నవై ఆగవు. చాలా దూరం వెడ తాయి" అంది రాధ.

"నీకెలాగ తెలుసు?"

"తెలుసును..."

"ఏదో! ఆ ప్రపపంచం వేరు...ఇవేళ పతివ్రతలుగా

చెలామణీ అవుతున్న వాళ్ళందరూ పతివ్రతలేనా?...ఏదో సర్దుకుపోతేనేం అన్నాడు అసలు రంగులు బయటపెడుతూ, సుందరం.

"అయితే-అదన్నమాట మీ ఉద్దేశం" అంది రాధ.

"అవును నేనలాగ కనిపిస్తాను గాని చాలా ఆధునికంగా ఆలోచిస్తాను తెలుసా? నువ్వు నాలుగు వేషాలు వేశావంటే మన సమస్యలన్నీ అలా- అలా- విడిపోతాయి. బాగా ఆలోచించు. కాదనకు..."

ఆమె మాటలు అతను వినిపించుకోలేదు.

రాధ చాలా తీవ్రమైన ఆలోచనలో పడింది.

# 7

"ఈ కూర...ఉడకలేదు" అన్నాడు సుందరం ఈ సంభాషణ జరిగాక వారం రోజుల తరవాత. ఈ వారమూ అతను రాధని మళ్ళీ సినిమా విషయంలో కదపలేదు. బహుశా ఇవేళో రేపో కదపవచ్చునని ఆమెకి అనిపించింది.

"అలాగా!" అంది రాధ.

"తినడానికి లేదు...ఏం తినేది?" అన్నాడు ఎప్పుడూ ఇంతవరకూ లేని కోపం చూపుతూ సుందరం.

ఉడక్కపోయాక చేసేదేముంది? కూరడబ్బు వృధా అవకుండా ఎలాగైనా తినెయ్యొచ్చు. లేదా అది వదిలేసి ఊరగాయ వేసుకుని తినవచ్చు."

సుందరం ఉడికిపోయాడు. తనకింత పౌరుషంగా జవాబు చెప్పడం రాధ ఎప్పుడూ చెయ్యని పని.

"నీకు కొవ్వెక్కినట్టుంది!" అన్నాడు. ఆ మధ్య వాళ్ళ అమ్మ ఒకసారి చెప్పనే చెప్పింది..."అలా విచ్చలవిడిగా వదిలేస్తే బరితెగించి పోతార్రా ఆడవాళ్ళు! అందులోనూ ఆ పట్నవాసంలో నీలాటి ఉత్తముడుని చూస్తే ఎవరికైనా కొంత లోకువ ఉంటుందిరా!" అని, తానెలాగ సంసారాన్ని అదుపులో పెట్టుకోవాలో, బయటికివెళ్ళి ఉద్యోగం చేసి డబ్బు తెచ్చినా అదంతా పైసలతో సహా తన దగ్గరకి తెచ్చి ఇచ్చేలాగ ఎలాగ చెయ్యాలో అన్నీ చెప్పింది. ఈ మధ్య భూషణం వచ్చి మరో వందరూపాయిలు 'స్వీట్లు' కొనుక్కోడానికి ఇచ్చాడు. ఒక ప్రొడ్యూసరుని తీసుకొచ్చాడు..."మోజు ఉన్నప్పుడే మనం రాబట్టాలి...కాకపోతే వేలకి వేలూ ఎవరిస్తారయ్యా! ప్రతీ పూటా సినీఫీల్డుకి ఇరవై మంది లడ్డుల్లాటి అమ్మాయిలు త్వమేవ శరణం అంటూ వచ్చేస్తున్నారు...ఏదో మా వాడివనీ, రాధ పరాయిది కాదనీ శ్రమపడ్డం కాని నాకు మాత్రం ఒరిగేదేముంది?" అన్నాడు. "ఆలశ్యామృతం విషం" అన్నాడు. సుందరాన్ని సస్పెన్స్ చంపేస్తోంది.

ఇవన్నీ మనస్సులోకి వచ్చాయి సుందరానికి. అతను

లోలోపల దాచుకున్నదీ బాధాకరమైనదీ మరో రహస్యం ఉంది. ఆమెని చూస్తే, ఆమెకి దగ్గరగా వెళ్ళాలంటే అతనికి ఒక ఇన్ఫీరియారిటీ కాంప్లెంక్స్. శుభ్రాతిశుభ్రమైన ఆ శరీరం, అలాంటివే బట్టలూ వేసుకున్న రాధకి రెండడుగుల పరిధిలోకి తాను వెడితే ఆమె నిద్రలో కూడా ముఖం చిట్లిస్తుందని అతనికి తెలుసును. రెండుమూడుసార్లు దగ్గరకి వెళ్ళినప్పుడు ఆమె ముఖంలో జుగుప్స అతనిలో అప్పటికే తక్కువగా ఉన్న మగ కోరికలకి చావు దెబ్బ కొట్టింది. "నువ్వెంత బాధపడి నా కక్కర్లేదులే" అని తనకి తాను చెప్పుకుని ఆనందంగా ఒంటరి బ్రతుకు బ్రతకడం నేర్చుకున్నాడు సుందరం.

ఇవన్నీ అతన్ని ప్రేరేపించాయి. కంచం ఎత్తి ఆమె మీదికి విసిరేడు. బలంగా తగిలి ఆమె నుదురు చిట్లింది.

ముఖంమీద పడిన అన్నం కళ్ళమీంచి దిగజారి ఒళ్ళో పడుతోంది.

రాధ లేచి నిలబడింది.

ఒడిలో ఉన్న అన్నం కూడా చీరమీద నించి నేలమీదికి జారుతున్నాయి.

ముఖాన ఉన్న కుంకుమ బొట్టు అన్నం తగిలి చెరిగి పోయింది. నుదుటికి ఒక పక్కకి చిట్లినచోట రక్తపు బొట్టు కొత్తగా, అజాగ్రత్తగా పెట్టుకున్న మరో ఎర్రటి బొట్టులాగ కనిపిస్తోంది.

రెండు మూడు నిమిషాలు అలాగే నిలబడి సుందరం

ముఖంలోకి చూసింది. ఏదో అనబోయాడు సుందరం. కాని, రోషరంజితమైన కళ్ళు అతన్ని ఆపేశాయి.

రాధ నెమ్మదిగా బాత్‌రూములోకి వెళ్ళింది. సుందరం చాలాసేపు చూసి ఆఫీసుకి వెళ్ళిపోయాడు. ఆమె వాలకం చూస్తే అతనికి తాను చేసినది తప్పేమోనని భయంవేసింది. ఆమెలో ఎప్పుడూ చూడని ఉంద్రేకం చూడడంతో అతను చాలా తికమకపడ్డాడు. ఆమెలో అంత రోష ఉంటుందని అత ననుకోలేదు.

ఆకలిగా కూడా ఉంది సుందరానికి. అప్పటికే ఆలశ్యం అయింది. అందుకని అంతదూరము బస్‌లోనే వెళ్ళేడు. టీ తాగి లంచ్‌టైమ్‌దాకా ఎలాగో పని అయిందనిపించేడు. టిఫిన్ మాట ఆలోచిస్తోంటే భూషణం వచ్చాడు. ఇద్దరూ కలిసి కేంటీ న్‌కి వెళ్ళేరు. సుందరం బాగా తిన్నాడు. బిల్లు భూషణమే చెల్లించాడు.

అంతా అయాక, "రాధతో మాట్లాడావా?" అని అడి గాడు భూషణం.

"అయింది...ఒకసారి కాదు..."

"ఏమంటుంది?"

"ఏముంది కాదంటుంది."

కొంచెం బిగ్గరగా నవ్వేడు భూషణం. "బలేవాడివయ్యా! మొగాడు చెప్పి ఆడది కాదంటే అంతేనా? అంత చాతగాని వాడివా?" అన్నాడు.

"చాతగానితనం కాదు...తనూ చదువుకుంది...ఒప్పుకోకపోతే ఎలాగ చేయిస్తాము? చెయ్యాల్సిన పనికూడా అలాటిదే కదా!" అన్నాడు సుందరం. ఉదయం జరిగింది అతనితో చెప్పి సలహా తీసుకోవాలని ఉంది అతనికి...కాని సిగ్గుగాకూడా ఉంది.

"ఏం, రాళ్ళెత్తమన్నామా? తనకి మాత్రం సరదా ఉండదూ? నలుగురిలో నవ్వుతూ తిరుగుతూ ఆనందించమన్నాం. అంతేగదా!..."

"ఏమో! రాధ కా పద్ధతులు నచ్చినట్టులేదు" అన్నాడు సుందరం నీరసంగా.

"నచ్చకపోడం నచ్చడం నీ చేతిలో ఉంటుంది—నువ్వే సరి అన్నాక ఆవిడ యిష్టమేమిటి? పిళ్ళమ్మని ఉంచుకున్నాడు వాళ్ళ నాయన. రాధకి చాలా మంది స్నేహితులు ఉండేవారు. కాదంటే నన్నడుగు. నేను చెప్తాను!...అంత పెద్దవేషాలు వేస్తోందా? ఇంట్లో కాదు. కెమెరా ముందు వెయ్యమను. నాలుగు డబ్బులైనా వస్తాయి!"

సుందరం కళ్ళముందు వందలూ వేలూ రూపాయిలు నాట్యం చేస్తున్నాయి. రాధ దీనికి కాదనడం కళ్ళముందే ఆ రూపాయిల కలలన్నీ కరిగిపోతూన్నట్టు ఉంది. సీసాలో పెట్టి మూత వేసేసినట్టు ఉంది అతని పరిస్థితి.

అతను ఆలోచనల్లోపడి మాట్లాడకపోవడం చూసి, "మరీ అంత చేతగానివాడివైతే చెప్పు. మరో అమ్మాయిని చూస్తాను..." అన్నాడు భూషణం.

వొళ్ళు మండింది సుందరానికి. ఆ రోజు జరిగిందంతా చెప్పేడు. "ఇంక ఏం చెయ్యమంటారు? మీరే చెప్పండి" అన్నాడు.

సంతృప్తిగా నవ్వి, "మగాడి వనిపించుకున్నావులే! అదే వరసలో ఒకవారం కాస్త నీ ప్రతాపం చూపెడితే తానూ ఎలా దారికి రాదో చూద్దాం!" చూడూ! పొరపాటున కూడా మళ్ళా కాళ్ళ బేరానికి దిగకు. వీళ్ళంతే. కాళ్ళు పట్టుకుంటే జుత్తూ జుత్తు పట్టుకుంటే కాళ్ళూను!" అన్నాడు లేచి వెడుతూ. అతని సలహా బాగుందని తోచింది సుందరానికి. సామం పద్ధతి అయింది. ఇంక దండం ఒక్కటే మిగిలింది.

ఆ ఆలోచనలతోనే ఇంటికి చేరేడు. వెళ్ళేసరికి రాధ లేదు. తాళంపెట్టి ఉంది. అసహనంగా గుమ్మానికీ గేటుకీ మధ్య అటూ ఇటూ తిరుగుతూ చాలా సేపు నిరీక్షించాడు సుందరం. ఎనిమిదిన్నర అవుతోంటే రిక్షాలో వచ్చింది రాధ.

అతన్ని చూడనట్టే ఆమె లోపలికి వెళ్ళింది.

వెనకాలే వెడుతూ, "మరీ ఆలశ్యంగా వచ్చావు...ఇంత సేపూ పైన నిలబడి ఉండాలి. ఆ తిరిగేది ముందుగానే చేసి టైముకి రాగూడదా?" అన్నాడు సుందరం.

రాధ మాట్లాడలేదు. కుర్చీలో కూర్చుని కళ్ళు మూసుకుంది. నుదుటిమీద చిన్న డ్రెస్సింగ్ ఉంది. అంతకన్నా చిన్న డ్రెస్సింగ్ బుగ్గమీద.

"కట్లు కట్టించావా?" అన్నాడు.

రాధ తల ఊపిందనుకున్నాడు.

"ఆ మాత్రం దానికే డాక్టరు కావాలా? సంసారం అన్నాక-ఏవేవో జరుగుతూ ఉంటాయి-సరేలే మంచిపని చేశావు...పద వంటచెయ్యి. చాలా ఆకలిగా ఉంది" అన్నాడు రెండో కుర్చీలో తానూ కూర్చుంటూ సుందరం.

"నాకు తల నొప్పిగా ఉంది."

"అయితే వంటచెయ్యవా?"

"చెయ్యను."

ధృఢంగా చెప్పింది రాధ.

"ఏమిటే!" అన్నాడు సుందరం లేచి నిలబడుతూ, "మొగుడికి భోజనం కూడా పెట్టలేవన్న మాట!" అని అరిచాడు.

"అరవకండి. నాకు వంట్లో బాగాలేదు. వంట చెయ్యను. కావాలంటే వెళ్ళి హోటల్లో తినిరండి. లేకపోతే పడుకోండి." అంది రాధ.

"నీకు పిచ్చి ఎక్కింది" అన్నాడు తాగి ఉన్నట్టు, సుందరం. మధ్యాహ్నం భూషణం చెప్పినవన్నీ అతనికి జ్ఞాపకం వచ్చాయి. రెండడుగులు వేసి ఆమె దగ్గరికి వచ్చి భుజంమీద చెయ్యివేసి, "లే" అన్నాడు.

కళ్ళు తెరిచి, "ఆ చెయ్యి తియ్యండి" అంది.

మరి కొంచెం గట్టిగా భుజం పట్టుకున్నాడు సుందరం. జరుగుతోన్నదంతా తన మగతనానికి ఛాలెంజిగా ఉందతనికి.

విసురుగా లేచి నిలబడి, అతని చేతిని విదిలిస్తూ, "చెప్తే వినబడదా?" అంది.

ఈసారి ఆమెని కొట్టడానికి చెయ్యి ఎత్తేడు సుందరం. అతను మండిపోతున్నాడు. గుడ్డిగా విసిరిన చేతినించి సుళువుగా పక్కకి తప్పుకుని, "నీ చెయ్యి తగిలితే ఈ రాత్రి కూడా ఇంట్లో ఉండనివ్వను. జాగ్రత్త" అంది రాధ కర్కశంగా.

"ఏమిటే?" అన్నాడు నిర్విణ్ణుడైపోయి సుందరం. రాధకేదో దయ్యంపట్టిందన్న ఆలోచన వచ్చిందతనికి.

"అవును. నీనించి సహించాల్సినదంతా సహించాను... చెమట వాసనా, కుక్కలాగ తిండీ, అంతులేని నీ స్వార్థం- అన్నిని. ఇంక అయిపోయింది. గౌరవంగా ప్రవర్తించు... దూరంగా ఉండు. నీ చెయ్యేకాదు, నీ మాటను కూడా ఇంక సహించేది లేదు" అంది రాధ. ఆమె ముఖం ఎర్రగా ఉంది. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు తీవ్రంగా వస్తూ ఆమె స్వరూపాన్నే మార్చేశాయి.

"జాగ్రత్త రాధా!...నువ్వు చేస్తోన్నవన్నీ సహించి ఊరుకున్నాను. మరీ పేట్రేగి పోకు. తలుచుకుంటే నిన్ను వదిలి మరోదాన్ని చేసుకుంటాను. కాని అగౌరవంగా మాట్లాడకు" అన్నాడు కుర్చీలో కూర్చుంటూ సుందరం.

"తప్పకుండా చేసుకో-కాని, నాకు బాధగా ఉంది. ఇప్పుడు గొడవ చెయ్యకు" అంది రాధ. నిజంగానే, రెండు సిచెన్ వెయ్యడాన్న మంటలాగ ఉంది.

"నువ్వు నువ్వు అని మాట్లాడకు...నా భోజనం మాట చెప్పు" అన్నాడు సుందరం. అతను బాగా తగ్గిపోయాడు.

"వెళ్ళి హోటల్లో తిను."

"డబ్బు దండగ."

"నేనిస్తాన్లే..." అంది రాధ. బేగ్‌లోనించి మూడు రూపాయలు తీసి టేబిల్ మీద పడేసింది. గాలికి అవి కింద పడ్డాయి. సుందరం తియ్యలేదు.

"ఆ మాత్రం-నా దగ్గరా ఉంది" అన్నాడు.

"సరే నన్ను విసిగించకు. వెళ్ళిరా" అంది రాధ.

"అక్కడ సయించదు..."

"పోనీ వండుకో..."

ఎర్రగా రాధవేపు చూశాడు సుందరం. ఆమె కళ్ళు మూసుకుంది. నిమిషం అలాగే నిలబడి చూసి, వొంగి, కిందని పడ్డ నోట్లుతీసి జేబులో పెట్టుకొని అతను వంటింటివేపు నడిచాడు. ఆమెతో ప్రవర్తించిన తీరులో పెద్ద లోపం వుండి ఉంటుందని అతననుకున్నాడు. ఆమెని ఓదార్చి ఉండాల్సింది కాబోలు. క్షమాపణ ఆ వెంటనేవచ్చి ఉండేది. బహుశా రాధ కరిగిపోయి వుండేది. కాని...అలాగ కాళ్ళబేరానికి రావడం లోకం తెలిసిన భూషణం అంగీకరించి వుండడు.

క్లుప్తంగా వంటముగించి, రాధకి పెడదామని అనుకున్నాడు సుందరం. కాని ఆమెకి పెట్టకుండా చేసినదంతా తానే

తిన్నాడు. దానితో అతనిపగ కొంత తీరినట్లు అయింది. అదీ కాక, అతనికి చాలా ఆకలిగాకూడా వుంది. రేపటికి తనే దారిలో పడుతుందిలే అనుకున్నాడు.

అతను వెళ్ళేసరికి బెడ్ రూమ్ తలుపు వేసివుంది. కిటికీలోనించి చూస్తే రాధ మంచంమీద పడుకుని నిద్రపోతోంది. వీధి గదిలో చాపా దిండూ విసిరినట్టు పడివున్నాయి. అక్కడే నిద్రపోయాడు సుందరం.

బాగా రాత్రయాక రాధకి తెలివి వచ్చింది.

ఆరోజు జరిగినదంతా కలలాగ ఉందామెకి. నిజమని తనకి తెలుసు కనకగాని, లేకపోతే నమ్మకపోయేదే!

ఆ మధ్యాహ్నం మూడుగంటలవేళ భూషణంవచ్చాడు- ఈసారి అతను ఒంటరిగా రాలేదు. శ్రీకాంత్‌నికూడా తీసుకొచ్చాడు. ఏదో చదువుకుంటున్న రాధ అతన్నిచూసి తలుపు తీసింది. వెనువెంటనే శ్రీకాంత్ ఉన్నాడు.

"నువ్వాబాబయ్యా?...ఈ టైములో ఎందుకొచ్చావు?" అంది రాధ.

"ఏం?...రాకూడదా? నీ మంచిచెడ్డలు నేను కాకపోతే ఎవరు చూస్తారు?" అన్నాడు రెండో కుర్చీ ఆ రెండో మనిషికి చూపెడుతూ. "శ్రీకాంత్‌గారు నిన్ను చూడాలన్నారు... వారి మాటైనా నువ్వు వింటావని...వచ్చేము" అన్నాడు.

రాధ శ్రీకాంత్‌ని చూసింది.

హుందాగా, ఎంతో ఆకర్షణీయంగా వున్నాడు మనిషి. ముఖాన అందమైన చిరునవ్వు వెలిగిపోతోంది.

"నమస్తే" అన్నాడు భూషణం చెప్తోన్నా కూర్చో కుండానే.

"నమస్తే" అంది రాధ లేచి నిలబడుతూ.

"మీరు కూర్చోండి. చెప్పకుండా, మీ అనుమతి తీసుకో కుండా వచ్చినందుకు క్షమించండి..." అన్నాడు మృదువుగా. ఆ గొంతుకలో ఉన్న సౌమ్యత ఆమె లోలోపల దేనినో కదిపింది.

ఫరవాలేదులెండి...మా బాబాయికి మర్యాద తెలీదు... మీరు కూర్చోండి" అంది, తానూ కూర్చుంటూ.

శ్రీకాంత్ నెమ్మదిగా కూర్చుని, "ఆయన తరపునా, నా తరపునా క్షమాపణ చెప్పుకుంటున్నాను...వెళ్ళి తరవాత రమ్మంటారా?" అన్నాడు.

చాలా కాలంనించి అంత సౌమ్యంగా ఆమెతో ఎవరూ మాట్లాడక కాబోలు. రాధకి చిరునవ్వు వచ్చింది.

"ఫరవాలేదులెండి" అంది.

"నేను వచ్చినపనిచెప్తాను...భూషణం మీకు చెప్పేదుట. మా పిక్చర్‌కి రేపుసాయంత్రం ముహూర్తం...ఇంకా పేరు పెట్టలేదు. మీరు యస్ అంటే అగ్రిమెంటు రాసుకుందాను... మీరు అభ్యంతరపెట్టడానికి ఏమీలేదు. స్క్రిప్ట్ కారకర్, హీరో

చెల్లెలు...మీతో పదిరోజులు పని వుంటుంది...అంతే" అన్నాడు శ్రీకాంత్.

"నాకు-సినిమాలు నచ్చవు..." అంది రాధ.

"మీరు చాలామందికి అన్యాయం చేస్తున్నారు" అన్నాడు చిరునవ్వుతో శ్రీకాంత్. ఎంత గౌరవంగా అతనామాటలన్నా, చిన్నపిల్లలంటున్నట్టే వుంది.

"శ్రీకాంత్‌గారు మామూలు మనిషికాదు రాధా! అసలాయన సినిమాల్లోకి దిగడం చరిత్రలో గొప్ప అధ్యాయం అని అందరూ అంటున్నారు" అన్నాడు భూషణం. చుట్టపుట్టించబోయి అతను శ్రీకాంత్ సైగచూసి మానేశాడు.

"ఆ పొగడ్తలకేమిలెండి! నేను కొత్తవాడిని. ఉన్నదీ, లేనిదీ, అన్నీకలిపి ఈ పిక్చర్‌మీద పెట్టేను. మా ఆశలన్నీ యీ పిక్చర్‌మీదనే వున్నాయి. ఆ పిక్చర్‌కి ఏమయినా ఆశ వుంటే అది మీమీదవుంది. ఆపైన మీ యిష్టం" అన్నాడు శ్రీకాంత్.

"నన్ను ఆలోచించనివ్వండి...ఆయనతోకూడా ఒకసారి చర్చించాలి కదా!" అంది రాధ, ప్రస్తుతానికి వాయిదా వేసేందుకు.

"సుందరం...మాట నేను చూసుకుంటానుగా!... ఆ ముఖంమీద దెబ్బ...డాక్టరుకి చూపెట్టలేదా రాధా? నిన్ననగా తగిలింది!" అన్నాడు భూషణం.

"నీకు తెలుసునా?" అంది రాధ అప్రయత్నంగా.

"తెలియకేం! ఆ రాస్కెల్ చేసినదానికి కుళ్ళిపోతూ

వచ్చి చెప్పుకుని ఏడ్చాడు. అన్నీ సవ్యంగా జరిగితే ఎల్లుండి షూటింగ్ ప్రారంభిస్తారు. పద...డాక్టరుదగ్గరకి వెళ్ళి చూపితే మంచిది" అన్నాడు భూషణం.

"నేను వెడతానులే" అంది రాధ.

"దయచేసి...నా కారులో తీసికెళ్ళనివ్వండి" అన్నాడు శ్రీకాంత్.

"వద్దండీ! అక్కరలేదు. నేను వెడతాను" అంది రాధ.

"ఏం ఫరవాలేదు. బయట కారులో కూర్చుంటాను. మీరు రండి..." అన్నాడు శ్రీకాంత్. అతనిలో అయస్కాంతత్వం ఏదో వుంది. రాధ నిశ్శబ్దంగా తలవూపింది.

అతనే ఆమెని డాక్టర్ దగ్గరకి తీసికెళ్ళేడు. స్టిచెస్ దగ్గర వుండి వేయించాడు. రాధ మరీ నీరసంగా వుంటే ఒక గంట అక్కడే రెస్టు తీసుకునేలాగ ఏర్పాటుచేసి వెళ్ళిపోయాడు.

"చాలా పనులు ఉన్నాయి ... లేకపోతే మిమ్మల్ని వదలి వెళ్ళేవాడిని కాదు. రేపు ముహూర్తం. అందుకని... ఉదయంవచ్చి కలుస్తాను" అన్నాడు.

అంతా కలలాగ వుంది రాధకి.

సినిమాలో చేరడం అంటే ఆమెకి నిజంగానే ఉత్సాహం అంత ఏమీలేదు. కాని, శ్రీకాంత్ మాట వేరు. జీవితంలో అలాంటి మనిషిని ఆమె కలవలేదు. ఎన్నాళ్ళనించో ఆమెలో నిద్రిస్తోన్నదేదో ఆ రోజు మేలుకుంది. చేతి ఒక్క విదిలింపుతో అతను భూషణాన్ని దూరంగా పంపేశాడనేకాదు. అతని ప్రతి

మాటలోనూ ప్రతిఫలించే దర్పమూ, అణకువా ఒక్కసారే కనిపించేలాటి అతని ప్రవర్తనా ఆమెని చాలాలొంగదీసుకున్నాయి. అదీకాక కారులోగాని, హాస్పిటల్లోగాని ఆమెని అతను పొరపాటున కూడా ముట్టుకోకపోవడం రాధకి చాలా విచిత్రమైన అనుభూతిని కలుగజేసింది...అతను అంత జాగ్రత్తగా, అంత దూరంగా ఉండకపోతే బాగుండేదని ఆమెకి అనిపించింది. కాని...అతని స్పర్శ పూర్తిగా మేలుకొలుపుతుందనీ, ఆ తరవాత సుడిగాలికిలాగ తాను లొంగిపోతాననీ కూడా ఆమెకి తెలుసును. అందుకే పరస్పర విరుద్ధమైనా, సంతృప్తీ అసంతృప్తీ కూడా ఆమెలో చోటుచేసుకున్నాయి.

రిక్షాకి డబ్బులిస్తోంటే పర్సులో కనిపించింది. వెయ్యి రూపాయిలు ఉన్నాయి. అవి ఎవరు పెట్టారో ఆలోచించనక్కరలేదు. కాని రాధకి అది నచ్చలేదు...శ్రీకాంత్‌నించి ఆమె ఆశించినది- తాను అంగీకరించకపోయినా- స్నేహం. ఆ స్నేహం గురించి ఆమె హాస్పిటల్లో పడుకుని ఉన్నప్పుడూ చాలా ఆలోచించింది. దానికి హద్దులులేవు. ఈ పరిసరాలనీ, తనచుట్టూ ఉన్న ఈ కొంచెంమంది కుళ్ళుమనుషులనీ, ఈ సౌందర్యహీనతనీ వొదిలేసి ఎక్కడో అందమైన ప్రదేశాలలో అతనితో, హద్దులులేని స్వేచ్ఛతో విహరించాలని ఆమెకి ఉంది. అందుకే అతనిలాగ డబ్బివ్వడం ఆమెకంతగా నచ్చలేదు కాని, రెండు కారణాలు ఆమెలో కలిగిన బాధని తగ్గించాయి. ఆ డబ్బు శ్రీకాంత్ ఇవ్వడం ఒకటి. రెండోది తనకది అడ్వాన్సుగా ఇవ్వారవు భావన.

రంగురంగుల నీటిబుడగలాంటి కలలు కంటోంది రాధ ఆ రాత్రి చాలావరకూను. తెల్లారుఝూమున ఎప్పుడో నిద్ర పట్టింది. ఉదయం ఏడు దాటుతోంటే సుందరం కిటికీలోంచి పిలిచి లేపేడు. నిద్రతో కళ్ళు బరువెక్కిపోయి ఉన్నాయి.

"ఏమిటి?" అంది రాధ.

"చాలా టైమయింది...లేచి వంటచెయ్యి" అన్నాడు సుందరం. అతనికి ఆకలిగా ఉంది. అదీకాక ఉదయం లేచినదగ్గర నించీ అతను ఆలోచనలో పడ్డాడు. రాధలో హఠాత్తుగా వొచ్చిన మార్పు అతనికి డేంజర్ సిగ్నల్‌లాగ పనిచేసింది. తనకి తెలీనిది ఏదో జరుగుతోందనీ, రాధ తన చెయ్యిదాటిపోకుండా ఉండాలంటే వెంటనే ఏదో ఒక చర్య తీసుకోవాలనీ సుందరానికి అనిపించింది. జరిగిందేమిటో తెలియకపోవడం అతని భయాలకి రంగులువేసి మరింతగా చేసింది.

"నాకు నిద్రగా ఉంది" అంది రాధ.

"అలా అంటే యెలాగ? ఆఫీసుకిపోవాలి...రాత్రి నేనే వొండానుగా! ఈ పూటైనా చెయ్యి" అన్నాడు సుందరం.

రాధకీ ఆకలిగానే ఉంది. రాత్రి ఏమీ తినకుండానే నిద్రపోయింది, శ్రీకాంత్‌ని తలుచుకుంటూ.

తలుపుతీసి ముఖం కడుక్కుని కాఫీచేసింది.

"నాకూ కావాలి..." అన్నాడు సుందరం.

"గిన్నెలో వుంది" అంది రాధ.

అతను వెళ్ళి తెచ్చుకున్నాడు. తాగి, కాఫీని మెచ్చుకుని, "భోజనం మాట ఏమిటి?" అన్నాడు.

"హోటల్‌కి వెళ్ళి తిని కేరేజీ తెస్తేసరి" అంది రాధ.

"ఎంత అవుతుందో తెలుసునా?" అన్నాడు సుందరం.

బేగ్‌లోనించి పదిరూపాయల నోటుతీసి ఇచ్చింది రాధ.

"ఎక్కడిది నీకు?" అన్నాడు జేబులో వేసుకుంటూ, సుందరం.

"కొత్త ఉద్యోగానికి- అడ్వాన్సిచ్చారు" అంది రాధ.

"ఉద్యోగమా? ఎంత జీతం?" అన్నాడు సుందరం.

"ఏమో!...అదంతా తెలీదు. బాగానే ఇస్తారు" అంది రాధ.

"అడ్వాన్సు ఎంత ఇచ్చారు?"

"వెయ్యి..."

తెల్లబోయాడు సుందరం. అతనికి భూషణం చెప్పినవన్నీ జ్ఞాపకం వొచ్చాయి.

"సినిమాలా?" అన్నాడు.

"అవును."

"నేను చెప్తే కాదన్నావుగా! ఇప్పుడు నీకు నువ్వే చేరుతున్నావు...ఏం?" అన్నాడు సుందరం. అతని బుర్రలో భూషణం మెదులుతున్నాడు.

"అలా అనిపించింది ... సరేనన్నాను" అంది రాధ.

శ్రీకాంత్‌తో ఆమె సరేనని అనలేదు. కాని అలాగ అనవలసిన అవసరం లేకపోయింది.

"ఎప్పుడిదంతా? నాకు చెప్పటంలేదేం?"

"చెప్పేచేముంది?...మీరు అంటూనే ఉన్నారుగా! నిన్న భూషణం వాళ్ళని తీసుకొచ్చాడు. సరేనన్నాను" అంది రాధ. ఆమె 'మీరు' అని అనడం సుందరానికి చాలా సంతృప్తి కలిగించింది. నిన్నను ఆమెని పట్టిన దయ్యం వొదిలేసిందని అతననుకున్నాడు. ఆమె సినిమాల్లో చేరడం నిజానికి అతనికి సంతోషంగా ఉంది. వాళ్ళు చాలా డబ్బు ఇస్తారని అతనికి తెలుసును. సుఖజీవనానికి ఈమె తన టికెట్. తన సమస్యలన్నీ త్వరగా తీరిపోతాయి.

"సర్లే, చూద్దాం...అయినా, నువ్వు వంటావార్పూ మానేస్తే ఎలాగ?...ఇలాగ వేస్ట్‌చేస్తే డబ్బు ఏం మిగులుతుంది?" అన్నాడు సుందరం గంభీరంగా. ఇవేళ ఒకపార్టీ ఏభై రూపాయ లిస్తానని అతనికి ప్రామిస్ చేశాడన్న విషయం అతనికి జ్ఞాపకం వొచ్చింది. అతని బిల్స్ జాగ్రత్తగా పట్టి ఉంచేడు.

రాధ చిరునవ్వుతో "ఆ హోటల్ భోజనం నాకుపడదు" అంది.

"గుడ్, లేచి త్వరగా వంటగానీ......" అన్నాడు సుందరం.

"మీరు చాలా బాగా చేస్తారని మీ అమ్మా లక్ష్మి చెప్పేరు..." అంది రాధ.

"అంటే?"

"ఇటుపైన వంటిల్లు మీదే! నావంట ఎలాగా బాగుండడం లేదుగా!...మీరెలాగ చేస్తారో చూద్దాం" అంది రాధ.

కోపంగా చూశాడు సుందరం.

"అదేం వీల్లేదు...అయినా, అంతమిడిసిపాటుకి ఏముంది? ఏపాటి ఇచ్చారు అడ్వాన్సు?" అన్నాడు.

"వెయ్యి రూపాయిలు..."

"వెయ్యా? నిజం?"

"అవును."

"అవి యిలా ఇయ్యి-నేను దాస్తాను."

"అక్కర్లేదు-నా బేంక్ అకౌంట్ ఉందిగా!" అంది రాధ.

"అంటే ఒక్కవేషం వచ్చిందికదా అని ఇంక మొగుడు అక్కర్లేదన్నమాట! ఏం?" అన్నాడు సుందరం. తనచెయ్యి జారి పోతోన్న వేయిరూపాయలు అతన్ని పిచ్చివాడ్ని చేశాయి. నాలుగయిదుసార్లు అడిగాడు. రాధ సమాధానమే యివ్వలేదు. ఆమెకి అత్యవసరమైన బట్టలకే అవి చాలవు. ఇతనికిస్తే రిజా ఖర్చుకూడా మిగలదు.

ఇల్లంతా వెతికేడు సుందరం. ఆమె బేగ్‌లో కనిపించిన డబ్బు తీసుకున్నాడు. రాధ అడ్డువచ్చింది. ఆమెకి డబ్బుపోవడం కన్నా ఈ అవమానం భరించలేనిదిగా వుంది. అతనికి అడ్డుపడింది. అతని చేతిలోనించి డబ్బు లాక్కుంది. ఆమె దగ్గరనించి అది

తీసుకునే ప్రయత్నంలో ఆమెని నాలుగు దెబ్బలు కొట్టేడు సుందరం. ఆ పరిస్థితిలో శ్రీకాంత్ వచ్చాడు.

అతనికి సుందరాన్ని గురించి భూషణం చెప్పేడు.

ఆమెనించి దూరంగాతోసి, "సిగ్గులేదా? ఆడదానిమీద చెయ్యి చేసుకుంటావా?" అన్నాడు.

"నువ్వెవడివి?" అన్నాడు సుందరం.

"ఆమెకి స్నేహితుణ్ని...మరెప్పుడైనా ఆమెకి కష్టం కలిగిస్తే జాగ్రత్త! ఈవూరి రౌడీల్లో రౌడీలు నా దగ్గర వున్నారు. ఆ తరవాత మీకు వంట్లో బాగుండదు" అన్నాడు స్వరం హెచ్చకుండానే శ్రీకాంత్.

ఆ క్షణంలో, స్వాగతం చెప్తూన్న అతని వక్షంమీద పడి పోదామని అనుకుంది రాధ. కాని, ఆ సాయంత్రం అతని బంగళాకు వెళ్ళేదాకా అలా చెయ్యడానికి అదను దొరకలేదు. ఆ రాత్రి యింటికి వెళ్ళాలనిపించలేదు. ఎయిర్ కండిషన్ చేసిన గదిలో చాలా హాయిగా వుంది. అదీకాక అక్కడ సుందరం లేదు.

## 8

ఆ తరవాత చరిత్ర చాలా రంగులతో నడిచింది.

శ్రీకాంత్ మరో సంవత్సరం తాను తీసే ఫిలిమ్ పేరున

అక్కడే వుండిపోయాడు. రాధ ఎంత అందంగా వున్నా, ఆమె తెరవెనకాలేగాని తెరమీద అందంతో కనిపించదని ముందరే తెలిసింది. కాని, శ్రీకాంత్ పట్టుపట్టి ఆమెచేత ఆ వేషం వేయించాడు. ఆమెకి నటన రాదనీ, ఎంత చిన్నవైనా డైలాగ్స్ చెప్పడం ఆమె శక్తికిమించిన పని అనీ త్వరలోనే తేలిపోయింది. అయినా శ్రీకాంత్ ఆమెమీద నమ్మకంతోనూ, అభిమానంతోనూ ఆమెని మార్చలేదు. రాధ తనకి తానే ఫిలిమ్‌నించి తప్పుకుంటానని చెప్పినా అతను వినలేదు. తనకి సర్వస్వం ఇచ్చుకుని, బదులుగా తననించి అన్నీ అడిగినవాళ్ళు అనేకులు అతని జీవితంలో చాలామందివున్నారు. కాని, రాధ ఎప్పుడూ అతన్ని ఏమీ అడగలేదు. అందుకే, ఆమెకి ఎంత యిచ్చినా, అతనికి సంతృప్తి ఉండేదికాదు. పిక్చర్ రిలీజ్‌కి వచ్చేలోపునే అతను ఆమెకోసం మంచి ఇల్లొకటి కొని ఇచ్చాడు. ఆమె టేక్స్ గొడవలు అన్నీ ముందే సరిచేసి ఆమె పేరన బాగా డబ్బుపెట్టేడు.

రాధ ఎప్పుడైనా, పేరుకి, ఇంటికి వెళ్ళేది.

సుందరం ముందర ఆమెని చాలా అల్లరిపెడదామని అనుకున్నాడు. కాని, ఆమె అన్నిటికీ తెగించిందని త్వరగానే అతను తెలుసుకున్నాడు.

"నీకు విడాకులిచ్చేస్తాను"అన్నాడు ఒకనాడు, శ్రీకాంత్ ఇంటినించి ఆమె రాగానే.

"మీలో యింత సంస్కారం, మంచీ ఉందనుకోలేదు. ఎక్కడ సంతకం చెయ్యాలోచెప్పండి" అంది రాధ. అతను అదిరిపోయాడు. ఆమెకి విడాకులివ్వడంద్వారా నష్టమూకష్టమూ తనదనీ, సుఖమూ, లాభమూ ఆబ్బదనీ అతనికి అర్థమైంది.

"ఇంత విచ్చలవిడిగా తిరుగుతున్నావు. నీమీదా, వాడి మీదా కేసుపెడతాను" అన్నాడు.

"పెట్టు సుందరం! ఆ మాత్రం పౌరుషం, మగతనం నీలో వుంటే, కొంత సంతోషంగా వుంటుంది నాకు" అంది రాధ.

"మళ్ళీ, నువ్వు నువ్వు అంటున్నావు" అన్నాడు సుందరం.

"ఇంక అంతే సుందరం! విడాకులు తీసుకో! మరో పిల్లని మంచి కట్నంతో చేసుకో. సుఖపడు. నాకు చాలా సుఖంగా వుంటుంది..." అంది రాధ.

* * *

రాధ కొత్త జీవితంలో నెల తిరక్కుండానే సుందరం సస్పెండ్ అయాడు. ఈమధ్య రాధ అతనికి డబ్బేమీ యివ్వడం లేదు. అతనికి మాటిమాటికీ ఇంటినించి ఉత్తరాలువస్తున్నాయి-అన్నిటిలోనూ సారాంశం ఒక్కటే-డబ్బుకావాలి. దానికితోడు ఆమెకీ లక్ష్మికికూడా జబ్బుచేసింది. ఇంటిమీద కొంత చెల్లుపెట్టి కొంత దగ్గర వుంచుకుని ఆమె వడ్డీవ్యాపారం చేసింది. అందులో ఇద్దరు ఆ వూరినించి మాయం అయిపోయారు. వాళ్ళు తాకట్టు పెట్టిన నగలు గిల్టువి.

రాధ రోజుల తరబడి యింటికి రావడంలేదు. ఆమె యీ మధ్య భోజనమేకాదు-గ్లాసుడు నీళ్ళుకూడా యింట్లో తాగి చాలాకాలం అయింది. ఎప్పుడయినా వస్తుంది. అదీ, ఎవరితోనో.

సుందరం రెండుచేతులా డబ్బుచేసుకునే ప్రయత్నానికి అదీ ఒక కారణం. ఇంట్లో అన్ని వసువులూ అతనే కొనుక్కో-

వాలి. ఎలక్ట్రిసిటీ బిల్ కట్టక డిస్కనక్టుచేస్తే మూడు నాలుగు రోజులు రాధకోసం యెదురుచూశాడు. ఆమె బొంబాయివెళ్ళి వారంరోజులు ఉంటానని అతనితో చూచాయగా అంది. ఆ ట్రిప్ పదిహేనురోజులు పట్టింది. ఆ డబ్బూ అతనే కట్టాల్సి వచ్చింది. డబ్బుచేసుకోవడం చాలా సులువుగానూ అవసరం గానూ కనిపించింది. పదిరోజులు తిరక్కుండానే ఒక బేరంలో ఏభయిరూపాయలకోసం చెయ్యిచాపి అతను పట్టుబడ్డాడు. దానితో అతని బ్రతుకు మరీ కష్టం అయిపోయింది. సగం జీతం... ఖర్చులు.

రాధకి అతను ఉన్నమాట చెప్పలేదు. "దొంగకేసు బనాయించేరు" అన్నాడు. రాధ ఏమీ పట్టించుకోలేదు.

"కాస్త డబ్బు ఇయ్యి" అన్నాడు.

"ఉందిగా! సగంజీతం ఇస్తోనే ఉన్నారుగా!" అందిరాధ.

అమ్మ జబ్బుసంగతి చెప్పేడు.

"వెళ్ళి అక్కడే వుంటే సరి! వేలకివేలూ అక్కడే ఉన్నాయి కదా!" అంది రాధ.

ఆమె అంగీకరించేలాగ కనిపించలేదు. అతనికి నిజంగానే డబ్బు అవసరంగా వుంది. ఈమధ్య సిగరెట్లుకూడా యెక్కువ తాగుతున్నాడు. అదో ఖర్చు.

"మంచికో చెడ్డకో-మనం భార్యాభర్తలం..."అన్నాడు. ఆపైన ఏదో చెప్పాలని అతననుకున్నాడు. కాని, మాటలు రాలేదు.

"అది-పేరుకి...నీ దగ్గర నరకయాతన అనుభవించాను.

అంచాత ఏదో కృతజ్ఞత కావాలంటే నిరాశపడాలి" అంది రాధ.

"అతను-శ్రీకాంత్ పిక్చరు పూర్తిచేశాడా?" అన్నాడు ప్లేటు మారుస్తూ సుందరం.

"చేస్తాడు" అంది రాధ పొడిగా.

*　　*　　*

ఆమె శ్రీకాంత్ ఆశించిన స్టార్ కాలేదు. ఆ పిక్చరు పదిరోజుల షూటింగు తరవాత ఆమె పాత్రకి మరొకరిని ఎన్నుకున్నాడు. ఆమె వెండితెరకి పనికిరాదు. ఆమె కంఠస్వరంకూడా రికార్డింగులో టెస్టుకి నిలబడలేదు. అప్పటికే శ్రీకాంత్ దగ్గర డబ్బు అయిపోయింది. అతనికి తిరుగు ప్రయాణం డబ్బులు మిగిలాయి. ఆమెకిమాత్రం ఇరవై వేలు చేసే నగలూ, సంవత్సరం అద్దె చెల్లించిన ఫ్లాటు మిగిలాయి. శ్రీకాంత్ విషయంలో ఆమె చాలా బాధపడింది-ఆమె కోరుకున్నది విచ్చలవిడి జీవితం కాదు; జీవితంలో చిన్నదో పెద్దదో అనుభవం - కొంచెమో గొప్పో ఆనందం. అది తాత్కాలికంగా శ్రీకాంత్ ఇవ్వగలిగేడు. కాని, అతని నిష్క్రమణ ఆమెకి చాలా విచారం కలిగించింది. ఆ విచారాన్నుంచి ఓదార్చడానికి రాజేంద్ర వచ్చాడు. ఒకప్పుడు రాజేంద్రని శ్రీకాంతే పరిచయంచేశాడు. నలభై యేళ్ళ రాజేష్ ఆమె జీవితాన్ని మరికొంత దూరం ఆ వొంకర దారులలో తీసికెళ్ళేడు.

"నేను-ఇల్లు మారుస్తున్నాను" అంది రాధ.

"ఇప్పుడు మాత్రం-ఈ యింట్లో వున్నావా?" అన్నాడు సుందరం.

"అదీ నిజమే! కాని, ఇల్లు ఒకటి కొంటున్నాను. అక్కడికే వెళ్ళిపోతాను. ఇంక ఈ యింటికి యెప్పుడోగాని రాను" అంది రాధ.

సుందరానికి ఆ మాటల అర్థం బోధపడేసరికి కొద్ది నిమిషాలు పట్టింది.

"మరి ఈ ఇల్లో?"

"అమ్మేద్దామనుకుంటున్నాను" అంది రాధ. నిజానికి ఆమెకి ఆ ఉద్దేశంలేదు. కాని అతన్ని చూస్తోంటే అలా అనాలనిపించింది.

"నేనేం చేసేది?" అన్నాడు.

రాధ మాట్లాడలేదు.

"అక్కడే-నాకు ఒక గది ఇయ్యి" అన్నాడు సుందరం.

"నీకుకూడా హాస్యం ఆడడం వచ్చునే!" అంది రాధ. ఆమె కేవలం సెంటిమెంటుకోసం వచ్చింది. అక్కడికి రాజేంద్ర వస్తే త్వరగా వెళ్ళిపోదామని వుంది.

"హాస్యం ఆడేలాగలేదు నా బ్రతుకు" అన్నాడు సుందరం. చాలా కాలంనించి కనిపించని అందం ఆమెలో అతనికి కనిపిస్తోంది. హఠాత్తుగా ఆమె విషయంలో తాను పొరపాటు చేశానని అతనికి అనిపించింది. అదేమిటో అతనికి సరీగా బోధపడలేదు. కులం లేని మనిషిని ప్రశ్నలడగకుండా పెళ్ళిచేసుకుని ఆమెకి ఉపకారం చేశానన్న భావం అతనిలో క్రమంగా నీరసించసాగింది. ఆమె తనచేయి దాటిపోతోంది-శాశ్వతంగా.

ఆమెవేపు చూశాడు.

డబ్బుకన్నా కూడా ఆమె ముఖ్యంగా కనిపించింది. పెళ్ళయిన కొత్తలో ఆమెని చూస్తే ఎలా అనిపించేదో మళ్ళీ అలా అనిపించింది. కాని, ఆమెకీ తనకీమధ్య యోజనాలదూరం. క్షణక్షణానికీ పెరిగే దూరం.

ఏం చెయ్యాలి? ఏమనాలి?

"ఇది నీకు న్యాయంగా ఉందా?" అన్నాడు సుందరం.

పెద్ద ఉపన్యాసం ఇవ్వాలనిపించింది రాధకి. సుందరం న్యాయాన్యాయాలని గురించి మాటలాడడం మొదట ఆమెకి కోపం తెప్పించింది. తాను చేస్తోన్నది తప్పు అని తెలుసును ఆమెకి.

కాని ఆమెలోని స్త్రీ,మనిషి ఒక్కసారి విజృంభించి పాప పుణ్యాలకి కొత్త అర్థాలు చెప్పేరు. మంచి చెడ్డలకి కళ్ళకి పైన రంగులు వేసేరు. స్త్రీగా ఆమెకీ కొన్ని సుఖాలు కావాలి... సుందరం ఆ విషయంలో ఆమెకి అన్యాయం చేశాడని ఏనాడో ఆమె తనని తాను ఒప్పించింది. మనిషిగా ఆమె కోరికలు తీర్చే శక్తి అతనిలో లేదు. రాదు కూడాను. భర్తగా అతనికి ఏ మాత్రం అధికారం ఇచ్చినా అతను విజృంభించి ఆమెలోని ఆశలనీ కలలనీ తునాతునకలు చేస్తాడని ఆమెకి తెలుసును. స్వతహాగా అంత చెడ్డవాడు కాదు సుందరం; కాని అతను అనేక రకాల చేతకానివాడు.

మరోసారి నవ్వింది రాధ.

సుందరం ఏడవలేదు. కాని, ఏడిస్తేనే బాగుండునన్నట్టు

పెట్టేడు ముఖం. ఎదుటివాళ్ళ బాధని తన బాధపాటే ఓర్చుకో లేని రాధకి రాజేంద్ర జ్ఞాపకం వచ్చాడు. అతనికి చాలా దూరంగా ఉండాలని అనుకున్న రాధ అతని బాధభరించలేనిదై పోయి అతనిదై పోయింది.

"సరే- ఇక్కడ ఉండు...ఇల్లు అమ్మను లే" అంది చివరికి.

"మరి నేను బ్రతకడం?" అన్నాడు సుందరం. ఆ మాటల్లో అధికారం గర్వం, మోసం ఏమీలేవు. దైన్యమూలేదు. నిస్సహాయత ఉంది. అంతే.

"చూద్దాం" అంది రాధ. ఆ క్షణంలోనే బయట కారు హారన్ వినిపించింది. ఆమె గుడ్‌బై చెప్తోన్నట్టు చెయ్యి ఊపి వెళ్ళబోయింది. రెండడుగులు వేసి వెనక్కి వచ్చి, అతనికి తాళాలగుత్తి బేగ్‌లోనించి తీసియిస్తూ, "ఇల్లు జాగ్రత్త" అంది.

"నువ్వెక్కడ ఉంటావు?" అన్నాడు సుందరం.

"కొత్త ఇంట్లో...ఇక్కడ ఉన్నవి జాగ్రత్తగా చూడు. ఆ చీరలు లక్ష్మికి ఇచ్చి..." అంది రాధ.

ఈసారి ఆమె వెళ్ళిపోయింది.

తాళాలు ఆ చేతిలోనించి ఈ చేతికి మార్చుకుంటూ సుందరం చాలా సేపు అక్కడే కూర్చున్నాడు. ఆ తరవాత నెలరోజులు అతను ఎప్పుడైనా బజారుకీ ఒకసారి ఆఫీసుకి తప్ప వెళ్ళలేదు. రెండోనెల జరుగుతూంటే అమ్మ దగ్గరనించి ఉత్తరం వచ్చింది. అమెకి ఒంట్లో మరీ బాగులేదని. ఊరికి వెళ్ళేడు. అక్కడే లక్ష్మికి పరిచయం అయిన నరసింహం అతన్ని కలిసి మాట్లాడేడు. నరసింహం లక్ష్మిని ప్రేమించాడట.

"ఏం కావాలి?" అన్నాడు సుందరం కులం, గోత్రం, వంశం మాట అతనికి జ్ఞాపకమే రాలేదు.

"లక్ష్మి. అంతే" అన్నాడు నరసింహం.

ఆ వారమే లక్ష్మి పెళ్ళి అయిపోయింది. ఇంటిమీద మరో వెయ్యి తెచ్చింది కాంతమ్మ. ఆ మరుసటి వారమే ఆమె గుండెపోటుతో కళ్ళు మూసింది. సుందరం తిరిగి వచ్చేశాడు.

# 9

ఏడెనిమిది సంవత్సరాల తరవాత ఒకరోజు ఆ ఇంటి ముందు రిక్షా ఆగింది. అందులో నించి అలిసిపోయి, వాడి పోయినా అందం చెడని ఆమె దిగింది.

ఆమె- రాధ.

రిక్షా దిగి రాధ గేటు తీసింది

గేటు తుప్పుపట్టి ఉంది. ఆమె చేతినిండా తుప్పు.

లోపలి తలుపుకి వేసిన తాళమూ అలాగే ఉంది. తాళం పెట్టి చాలాసేపు ప్రయత్నించినా రాలేదు.

రిక్షావాడు ఆమె సామాన్లు ఒక్కొక్కటే గుమ్మం దగ్గర పెట్టి, "మీరు తప్పుకోండమ్మా. నేను చూస్తాను" అన్నాడు.

రెండు సూట్ కేసులు. మూడు బ్రీఫ్ కేసులు. చిన్న చిన్న సామాన్లు. అన్నీ నీట్ గా పెట్టి ఉన్నాయి.

వాటిలో ఆమె ఆస్తి అంతా ఉంది.

బట్టలు, నగలు, ఖరీదైన డబ్బు. డిపాజిట్ కాగితాలు. అన్నీ. విలువైనవి అన్నీ ఉన్నాయి. సుఖం తప్ప. ఆనందం తప్ప. అన్నీ.

"తాళం విరగ్గొట్టాలమ్మా. తుప్పుపట్టి పోయింది" అన్న రిక్షావాడి మాటలతో ఈ ప్రపంచంలోకి వచ్చింది.

"అలాగే చెయ్యి" అంది రాధ.

రాతితో నాలుగు దెబ్బలు కొట్టేడు అతను. తాళం విడింది. తలుపుతీసి లోపలికి వెళ్ళింది రాధ. డబ్బిచ్చి రిక్షావాడిని పంపించింది. లోపలికి అడుగు పెట్టింది.

అంతా దుమ్ము. దుర్వాసన.

త్వరత్వరగా తలుపులు తెరిచింది. చాలా కాలం తరవాత ఆ గదిలోకి వెలుతురు వచ్చింది అని తెలుస్తోంది. గోడలన్నీ నల్లగా, బూజులుపట్టి ఉన్నాయి. నేలకూడా అసహ్యంగా ఉంది- అంతా అసౌందర్యం. శిధిలం.

జానకి త్వరగా వస్తే బాగుండును...

కుర్చీనిండా దుమ్ము. దులిపేందు కేమీలేదు. సూట్ కేసులోనించి ఒక టవల్ తీసి దులిపింది. ఆమె బట్టలనిండా, ముఖంనిండా దుమ్ము.

ఆ కుర్చీలో చాలాసేపు కూర్చుంది.

అటు గేటు తీసిన చప్పుడు అయి జానకి వస్తుందనుకుని తల ఎత్తి చూసింది.

ఎవరో బైరాగిలాగ ఉన్నాడు. కాషాయ వస్త్రాలు. పెద్ద జుత్తు. గెడ్డాలు.

"నువ్వా, రాధా!" అన్నాడు.

ఆ కంఠస్వరం గుర్తించింది రాధ.

"సుందరం..." అంది ఆశ్చర్యంతో నీరసపడిపోయి.

"అవును...నువ్వు ఇక్కడ ఎందుకున్నావు?" అన్నాడు.

"నా యిల్లు కదా! వచ్చేను..." అంది రాధ. ఆ మాటల్లో బాధలేదు. దైన్యమూ లేదు. ఒక చిన్న నిజం. అంతే.

"ఇల్లేమిటి ఇలా ఉంది?" అన్నాడు సుందరం.

"లోపలికి వెలుతురు వచ్చి చాల కాలం అయింది" అంది రాధ.

"అంటే?...నేను వెళ్ళేక -ఇల్లు తెరవలేదా?"అన్నాడు సుందరం చుట్టూ చూస్తూ.

"లేదు-నువ్వు...మీరు...తాళాలు అక్కడ వదిలి వెళ్ళేక మళ్ళా తెరిపించలేదు..."

"ఏం?"

"కోరిక లేక. తీరిక లేక..."

సుందరం వేషంలో ఎలాగ ఉన్నా, అతని కళ్ళలో ఒక కాంతి వచ్చింది. మనిషిలో అంతకుముందు లేని స్థయిర్యం ఉంది. అందుకే ఆమె అతన్ని పిలుపులో గౌరవించగలిగింది. అతనది

"మరి-ఇవేళ ఎందుకు వచ్చావు?" అన్నాడు ఆమె కళ్ళ ల్లోకి చూస్తూ.

"చెప్పేను కదా!...నా యిల్లు..."

వెనక్కి చూస్తే ఆ ఆధునికమైన పరిసరాలలో. ఆ విలాసాలలో, వారానికీ నెలకీ మారుతోన్న మగవాళ్ళ చేతుల మధ్య గడపిన తన జీవితం ఇకవద్దు అనిపించిందని ఆమెకి చెప్పాలనిపించలేదు...తనకాళ్ళమీద పడిన చేతులే తనని దూరంగా తోసివేసే సందర్భాలని గురించీ, అవి తనలో కలిగించిన దుమారాలనీ, క్రమక్రమంగా తనలో తనమీద తనకే కలిగిన జుగుప్సని గురించి అతనికి చెప్పాలనిపించలేదు రాధకి. ఎందుకంటే, అతను తనకేమీ కాదు. నిజానికి ఎవరూ తనకేమీకాదు. ఎవరికీ తానేమీ కాదు...ప్రాకృతికమైన అవసరాలు తీర్చే శరీరం తప్ప. అన్ని కోరికలూ తీరేక వాటన్నిటినీ అసహ్యించుకునే క్షణాలూ, గంటలూ, రోజులూ, వారాలూ వచ్చాయనీ ఆమె చెప్పలేదు.

"మీరు..." అంది.

ఈసారి గంభీరంగా నవ్వేడు సుందరం.

"దేశమంతా తిరిగేను రాధా! నువ్వు వెళ్ళిపోయాక, అమ్మ పోయాక ఏమిటో ఇది అంతా, అనిపించింది...హరిద్వార్ వెళ్ళేను. బదరీ వెళ్ళేను. కాశీలో ఆరేళ్ళు ఉన్నాను... చాలా నేర్చుకున్నానులే!...అవకాశం వస్తే చెప్తాను. అందరి అన్నమూ తిన్నాను. నాకు సిగ్గులేదని నీకూ తెలుసు కదా!... కాని-చివరికి అక్కడా ఏమీ లేదనిపించింది. ఈ ఇల్లు-ఇది ఒకసారి చూడాలనిపించింది. వచ్చేను."

"ఇంకేమీ అడగకు!...ఈ తిరుగడం నాకు నేర్పిన పాఠం ఒక్కటి ఉంటే అది ఏదీ నాది కాదని...కాని, చివరికి-మళ్ళీ ఇలా రావాలనిపించింది. ఎందుకనీ అడగకు. కోరికలు చచ్చే యనుకున్నాను, కాని ఈ కోరిక మిగిలిపోయింది...వచ్చేను. మధ్యన రెండు రోజులు టికెట్ లేదని జెయిల్లో కూడా పెట్టేరు... వదిలేశారు—"

బయటనించి గాలి ఒక్కసారి వచ్చి దుమ్ములేచి యిద్దర్నీ చుట్టింది.

"అమ్మగారు!" అంటు వచ్చింది జానకి. చేతిలో ప్లాస్టిక్ బకెట్టూ, చీపురూ ఇంకా ఏవేవో సామాన్లూ తెచ్చింది.

"అందరూ వదిలినా నువ్వు వదలలేదు జానకీ" అంది రాధ. ఆమెకి కన్నీళ్ళు వచ్చాయి.

"ఊరుకోండమ్మా! ... మీరు మరీని. ఈ బైరాగి ఎవరూ?...వెళ్ళు వెళ్ళు బైటికి..." అంది ఓదార్పునించి ఉగ్రతకి ఒక్కసారి వచ్చేస్తూ జానకి.

"ఆయన...ఇక్కడ ఉంటారులే" అంది రాధ ఆమెని వారిస్తూ.

ఇంక ప్రశ్నించలేదు జానకి.

"బయటి కెళ్ళండమ్మా...యిల్లు ఊడుస్తాను" అంది జానకి.

రాధా, సుందరం బయటికి వెళ్ళి నిలబడ్డారు. ఒకప్పుడు గేటుకీ ఇంటికీమధ్య పువ్వుల మొక్కలు ఉండేవి. మల్లె పొద, గులాబీలూ-అన్నీ ఎండిపోయాయి.

"మొక్కలు వేసుకోవాలి..." అనుకుంది రాధ స్వగతం లాగ. కాని, పైకే.

"అవును. నా చేత్తో వేస్తే ఏ మొక్క అయినా ఎంతో చక్కగా పెరుగుతుంది తెలుసునా?..." అన్నాడు సుందరం.

పరికించి చూసింది రాధ అతన్ని.

"కొంతకాలం ఇక్కడ ఉండాలనిపిస్తోంది...ఈ ఇంటికి వెల్లలు కొట్టించాలి. అన్నట్టు కరెంటు లేదుగా! వెళ్ళి డబ్బు కట్టి కనెక్షన్ తెస్తాను..." అన్నాడు సుందరం..

"డబ్బు తెస్తాను..." అని లోపలికి వెళ్ళి నాలుగు వందలు తెచ్చి ఇచ్చింది రాధ.

"ఇంత ఎందుకు!" అన్నాడు సుందరం.

"ఇంటికి ఇంకా చాలా కావాలి కదా!" అంది రాధ.

"అవును. అన్నీ నేను తెస్తాను..." అని వెళ్ళిపోయాడు సుందరం. తిరిగి తిరిగి మూడుగంటలకి తిరిగివచ్చి, "ఆరుగంటలకి కరెంటు వస్తుంది" అన్నాడు ఆమెకి రెండు వందలిస్తూ. "రెండులో అన్నీ అయ్యాయి" అన్నాడు.

"పదండి. భోజనం చేద్దాం" అంది రాధ.

"ఎలాగ చేశావు?"

"జానకి ఉందిగా! అన్నీ తెచ్చింది."

"ఇద్దరు నేలమీద కూర్చుని భోజనం చేశారు.

"వంట బాగా చేశావు" అన్నాడు సుందరం.

"నేను కాదు...జానకి"

"అలాగా!" అన్నాడు సుందరం...కొంచెం ఆగి,

"మధ్యాహ్నం ఆఫీసుకి వెళ్ళేను. కావాలంటే డిమోషన్ మీద మళ్ళీ ఉద్యోగంలో చేరొచ్చు" అన్నాడు.

రాధ ఏమీ అనలేదు.

"ఏం చెయ్యమంటావు?" అన్నాడు.

"మీ ఇష్టం" అంది రాధ.

ఫర్నిచరంతా శుభ్రంచేసింది జానకి.

చీకటి పడింది. కొవ్వొత్తులు వెలిగించి వంట చేస్తోంది జానకి.

అప్పటిదాకా నిద్రపోయాడు సుందరం.

రాధ ఆలోచిస్తూనే కూర్చుంది. నిన్న రాత్రి ఎయిర్ కండిషన్డ్ రూమ్‌లో నిద్రపోయింది. ఈ రోజు ఫేన్ కూడా లేని ఈ గదిలో, ఎంత శుభ్రం చేసినా ఇంకా ఉండిపోయిన ఈ దుమ్ము మధ్య నిద్ర పోవాలి. ఆ ఆలోచన క్షణికంగా ఆమెకి బాధ కలిగించింది.

అవతలి గదిలో నేలమీద చాప వేసుకుని నిద్రపోతోన్న సుందరం లేచి వెళ్ళి స్నానం చేసి వచ్చాడు. అవే బట్టలు వేసుకున్నాడు.

"లైటు రాలేదా?" అన్నాడు.

"లేదు" అంది రాధ.

"నేనలాగ ఎలెక్ట్రిసిటీ ఆఫీసుకి వెళ్ళివస్తాను" అని అతను వెళ్ళిపోయాడు. రాధ లేచి తానూ స్నానానికి వెళ్ళింది. బాత్‌రూమ్ కొంత శుభ్రంగా ఉంది.

ఆమె ఇవతలికి వచ్చేసరికి ఇంటినిండా నాలుగైదు కొవ్వొత్తులు వెలుగుతున్నాయి. సాయంత్రమంత అసహ్యంగా లేదు ఇల్లు. సుందరం ఉన్నాడు. కనుక అనుకున్నంత ఒంటరితనమూ లేదు.

మరో గంట పోయాక సుందరం వచ్చాడు.

ఇద్దరూ భోజనం చేశారు.

జానకి పరుపు దులిపి శుభ్రమైన దుప్పటి వేసింది.

రాధకి నిద్రవస్తోంది. మానసికంగా కూడా ఆమె చాలా అలిసిపోయింది.

సుందరం వచ్చి ఒక కుర్చీ తెచ్చుకుని కూర్చున్నాడు. అతని సంచీలోంచి ఒక పుస్తకం తీశాడు. "ఏమిటది?" అంది రాధ.

"గీత, అంతా కంఠస్థం చేశాను. రోజూ మూడు గంటలు చదవడం అలవాటైపోయింది. అవతలి గదిలో చదువుతాను..." అన్నాడు.

"కంఠస్థం అయిందిగా?" అంది రాధ మంచం చివర్న కూర్చుంటూ.

"అవును యింకా అర్థం చేసుకోవాలి. అంతే" అని ఆగి, "మనం మళ్ళీ ఇలాగ కలుసుకుంటా మనుకోలేదు. నీకు చాలా చెప్పాలి. ఈ పదెనిమిది ఏళ్ళలో ఎన్నో జరిగాయి" అన్నాడు.

అతనివేపు పరికించి చూసింది రాధ. అప్పటి తమస్సు అతని ముఖంలో కనిపించడం లేదు. "అవును చాలా జరిగి ఉంటాయి. తప్పకుండాచెప్పండి...ఇవాళే చెప్తారా?" అంది.

"వద్దులే. నువ్వూ అలిసిపోయావు. నిజానికి నేనూ అలిసిపోయాను...ఈ సంవత్సరాలన్నీ నువ్వూ చాలా తిరిగేవు..." అని, ఆగిపోయాడు సుందరం.

మోకాళ్ళమీద తల ఆన్చుకుని, అవును. చాలా తిరిగాను. అవన్నీ మీరు వినాలని ఉత్సాహపడకపోవచ్చును" అంది రాధ.

"నీకు చెప్పే ఉత్సాహం, చెప్పాలనే తహతహ ఉంటే చెప్పు, వింటాను. ఏం జరిగిందో చూచాయగా నాకూ తెలుసును...ఇష్టం ఉంటే చెప్పు. లేకపోతే వద్దు." అన్నాడు సుందరం. అతని కంఠస్వరంలోనూ పెద్ద మార్పు ఉంది. ఎంతో గంభీరంగా ఉంది, అతని కళ్ళలాగే.

"మీరు...అన్నీ వింటే అసహ్యించుకుంటారు...నా మనస్సు తేలిక చేసుకోడానికి మీలో జుగుప్స కలిగించలేను" అంది రాధ.

దయామయుడిలాగ నవ్వాడు సుందరం.

"రాధా! ఆ సుఖాలన్నీ వదిలి ఈ బూజుల ఇంటిలోకి వచ్చావు. ఎలాటి కారణాలో నేను ఊహించగలను. అవి ఏమైనా, నేను ఇంత తిరిగి, చదివి నేర్చుకోని పాఠం నువ్వు నేర్చుకుని ఆచరణలో పెట్టేవు. అదే నీ మీద నాకు గౌరవం కలుగజేసింది...నేను ఆ రోజు నీకు తాళాలు ఇచ్చి వైరాగ్యంతో బయలుదేరాను. తిరిగాను. చాలా నేర్చుకున్నాను. నేలమీద చెట్లకింద నిద్రించే నేను ఈ ఇంట్లోకి వచ్చాను. రేపు ఈ జుత్తు తగ్గించి, గెడ్డం గీయించి, ఉద్యోగంలో చేరుతాను...అది వెనక్కి వేసే అడుగు, అంచేత నా మీద నీకు అసహ్యం కలక్కపోతే అది నీలో శుశ్రూష" అన్నాడు సుందరం.

"ఇక్కడ ఉంటారా?...అదే-శాశ్వతంగా..." అంది రాధ.

"ఉండాలని ఉంది. ఆ జీవితంతో అలిసిపోయాను... కాని- నీ ఇష్టం. నా ప్లాన్ చెప్పేనుగా!" అన్నాడు సుందరం.

"ఉండండి. తప్పక ఉండండి..." అంది రాధ.

"అలాగే. నువ్వు పడుకో...ఫేన్ లేదు. కిటికీలు తీస్తాను..." అన్నాడు సుందరం. ఆమె వారించేలోగా ఆ పని చెయ్యనేచేశాడు.

"మీ రిక్కడ పడుకోండి..." అంది రాధ.

"నిద్రపట్టదు. నే నవతలి గదిలో చాపమీద పడుకుంటాను...నో, వాదించకు" అన్నాడు.

అదే క్షణంలో దీపాలు వెలిగాయి.

"దీపాలు వచ్చాయి. నీకు భయంలేదు...నిద్రపో" అన్నాడు సుందరం.

రాధ నవ్వి, "నాకు భయంలేదులెండి..." అంది గదిలో వెలుగుతోన్న దీపం తీసేసాడు సుందరం. ఆమె అలసటతో ఒరిగిపోయింది. రెండు నిమిషాలలో ఆమె నిద్రపోయింది.

కొంచెం సేపు ఆమెని పట్టిపట్టి చూసి, ఆశీర్వదిస్తోన్నట్టు ఆమె నుదుటిమీద ఒకసారి తేలికగా చెయ్యిపెట్టి,తలుపు మెల్లిగా తీసి సుందరం అవతలి గదిలోకి వెళ్ళి నిశ్శబ్దంగా చదువుకోడం ప్రారంభించాడు. గీత మొదటి అధ్యాయం : మొదటి శ్లోకం నించి బయట చిన్న చినుకులు పడడం మొదలెట్టాయి.

... * * * ...